# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..


31.10.2025 శుక్రవారం Friday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 129 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana





## చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట

### అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు



ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట లభించింది. వచ్చే ఏడాది ప్రారంభం వరకు అమెరికా ఆంక్షల నుంచి దీనికి మినహాయింపు దొరికింది. అమెరికా గతంలో ఇచ్చిన మినహాయింపునకు నేటితో గడువు ముగిసిన నేపథ్యంలో మళ్లీ ఈ గడువు పొడిగింపు వచ్చింది. దీంతో చాబహార్ పోర్ట్‌లోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణకు భారత్‌కు వీలు కలిగింది. చాబహార్ పోర్టుపై ఆరు నెలల పాటు ఈ ఆంక్షల మినహాయింపు ఉందని భారత ప్రభుత్వం ధ్రువీకరించింది.

.. వివరాలు 4లో

## మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్

ఉత్కంఠ రేపిన సెమీ ఫైనల్లో భారత జట్టు జయభేరి మోగించింది.. ఎనిమిదిసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియాకు చెక్ పెడుతూ రికార్డు లక్ష్యాన్ని మరో ఓవర్ ఉండగానే ఊదిపడేసింది. భారీ ఛేదనలో జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్) చిరస్మరణీయ శతకంతో చెలరేగగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(89)తో సెంచరీ భాగస్వామ్యంతో విజయానికి బాటలు వేశారు. ఆఖర్లో రీచా ఘోష్(26), అమన్‌జోత్ కౌర్(11 నాటౌట్) ఒత్తిడిలోనూ గొప్పగా ఆడారు. దాంతో.. వరల్డ్ కప్ నాకౌట్ చరిత్రలో అత్యధిక లక్ష్యాన్ని చేదించింది టీమిండియా. 5 వికెట్ల తేడాతో కంగారూలను ఓడించిన హర్మన్‌ప్రీత్ సేన ఆదివారం దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో తలపడనుంది.

.. వివరాలు 7లో

## జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

- మైనార్టీ ఓట్లకు గాలం వేసిన కాంగ్రెస్
- అజారుద్దీన్‌కు మంత్రి పదవిపై విమర్శలు
- బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం








.. వివరాలు 3లో

# ముంచిన మొంథా





### రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్

### అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

### నష్టాలను అంచనా వేసి వివరాలను తెలియజేయాలి

- విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి
- నేడు వరంగల్, హుస్నాబాద్‌లలో సీఎం పర్యటన



ఇది వరి కోతల కాలం.. కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు.

**హైదరాబాద్, అక్టోబర్ 30:** శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గురువారం వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మిగతా 2 లో



## ముంబైలో 20మంది పిల్లల నిర్బంధం

### విడిపించే క్రమంలో పోలీస్ కాల్పుల్లో వ్యక్తి మృతి



2

## ప్రాణముండగానే మార్చురీకి

### రాత్రంతా ఏడుపులు..లోపలికి వెళ్లి చూస్తే షాక్

### మహబూబాబాద్ దవాఖానలో దారుణ ఘటన



## నేడు కేబినేట్ విస్తరణ

### అజారుద్దీన్ కోసం ప్రత్యేకం

### రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు

వివరాలు 2వ పేజీలో




4

## సుప్రీంకోర్టు సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ విడుదల

సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# రైతులకు వేదన మిగిల్చిన మొంథా తుఫాన్

మొదటి పేజీ తరువాయి

అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధింత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, అవుట్ ఇన్‌ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గురువారం వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే



నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

**అజారుద్దీన్ కోసం ప్రత్యేకం ● రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు**

**హైదరాబాద్, అక్టోబర్ 30:** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. 22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదువులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తనకు హామీ ఇచ్చి పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నా ఆయనకు మాత్రం అవకాశం దక్కకపోవడం గమనార్హం.

# ప్రాణముండగానే మార్చురీకి

**రాత్రంతా ఏడుపులు..లోపలికి వెళ్లి చూస్తే షాక్**

**మహబూబాబాద్‌దవాఖానలో దారుణ ఘటన**



**మహబూబాబాద్, అక్టోబర్ 30:** వైద్యం కోసం వచ్చిన రోగిని ఆధార్ కార్డు లేదనే నెపంతో ఆసుపత్రిలో చేర్చుకునేందుకు ఆసుపత్రి సిబ్బంది అంగీకరించలేదు. ఆసుపత్రి ఆవరణలో రోగి.. వైద్యం కోసం రెండు రోజుల పాటు పడిగాపులు కాస్తూ నిరీక్షించి నీరసించడంతో సిబ్బంది మృతి చెందాడనే అనుమానంతో మార్చురీలో భద్రపరిచిన అమానవీయ సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో చోటుచేసుకుంది. చిన్న గూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన వి.రవి మూత్ర పిండాల వ్యాధితో ఇబ్బంది పడుతూ మూడు రోజుల క్రితం జిల్లా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చాడు. రోగికి తోడుగా ఎవ్వరు ఉండక పోవడంతో పాటు ఆధార్ కార్డు లేకపోవడంతో ఆసుపత్రిలో చేర్చుకోవడానికి వైద్య సిబ్బంది నిరాకరించారు. దీంతో రోగి 2 రోజుల పాటు ఆస్పత్రి ఆవరణలో పడిగాపులు పడి.. నీరసించి ఆ చేతనంగా మారిపోయాడు. రోగి మృతి చెందాడనే అనుమానంతో వైద్య సిబ్బంది ఆసుపత్రిలోని మార్చూరికి తరలించి భద్ర పరిచారు. మరుసటి రోజు మార్చురిని శుభ్ర పరచడానికి వచ్చిన స్వీపర్లు.... రోగి కదలికలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని రోగిని వైద్యం చేయిస్తున్నారు. ఆసుపత్రిలో ఇంత దారుణం జరిగినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగి పట్ల ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరు.. మానవత్వం మంటగలిపారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన జంట

**యువకుడు క్షేమం.. యువతి గల్లంతు ● జనగామ జిల్లాలో విషాద ఘటన**





**జనగామ, అక్టోబర్ 30:** జనగామ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. మొంథా తుపాన్ ప్రభావంతో జిల్లాలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద దాటికి బైక్‌పై వెళ్తున్న యువతీ, యువకుడు కొట్టుకుపోయారు. హైదరాబాద్‌కు చెందిన బరిగల శివకుమార్, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెదిన యువతి శ్రావ్య ఇద్దరు కలిసి బైక్ వస్తున్నారు. ఈ క్రమంలో స్టేషన్ ఘనపూర్ నుంచి జఫర్‌ఘడ్ వెళ్లే ప్రధాన రహదారిపై తిమ్మంపేట గొల్ల మత్తడి వద్ద రోడ్డుపై వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరదను లెక్క చేయకుండా దాటే ప్రయత్నం చేయగా బైక్‌తో సహా ఇద్దరు కొట్టుకుపోయారు. శివకుమార్ చెట్టు కొమ్మను పట్టుకొని సురక్షితంగా బయటపడ్డాడు. యువతి మాత్రం గల్లంతయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు గొల్ల ముత్తడి వద్దకు చేరుకుని 30 మంది ఎస్డిఆర్ఎఫ్ బృందాలతో గాలిస్తున్నారు. కాగా, యువతి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేస్తూ అమ్మాయిని ప్రైవేట్ హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు. హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో శ్రావ్య చదువుతున్నట్లు సమాచారం. బోళ్ల మత్తడి వద్ద డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవో వెంకన్న, ఏసీపీ నరసయ్య సమీక్షిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయండి

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్**

**హైదరాబాద్, అక్టోబర్ 30:** రాష్ట్రంలో ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్లుగా పౌరసరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ చెప్పారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం రైతులు నష్టపోవటం ఆందోళన కలిగించిందని అన్నారు. కల్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతీ ఐకేపీ సెంటర్ నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్టు తెప్పించుకోవాలని, రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిం దని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని, కుంభ వృష్టి కురిసే సమయంలో ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం ఏది వచ్చినా రైతులకు ఆవేదన మిగులుస్తుందని సీఎం అన్నారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు.

# వరంగల్ ముంపు ప్రాంతాల్లో పోలీస్ సేవలు

**సీఎస్, డీజీపీకి ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్, అక్టోబర్ 30 :** వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మొంథా తుపాను వరంగల్ జిల్లాను ముంచెత్తింది. భారీ వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో జిల్లాలో వరదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని అన్నారు. వరంగల్ జిల్లాకు వెళ్లనున్న సీఎం... వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. కాగా.. వరంగల్ నగరాన్ని మొంథా తుపాను అతలాకుతలం చేసింది. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. అనేక ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరంగల్ నగరంలోని 30 ముంపు కాలనీలతో పాటు హనుమకొండలోని 15 ముంపు కాలనీవాసులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు డిజాస్టర్ సిబ్బంది తరలించింది. హనుమకొండలో మూడు పునరావాస కేంద్రాలు, వరంగల్లో 9 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1200 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రేటర్ పరిధిలో ఏడు ప్రత్యేక బృందాలను వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ ఏర్పాటు చేసింది. ఏడు బృందాల ద్వారా సహాయ చర్యలను సిబ్బంది చేపట్టింది. మరోవైపు భారీ వర్షం నేపథ్యంలో పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు.

# రైతులను ఆదుకుంటాం

**● పంట నష్టపోయిన ప్రాంతాల్లో మంత్రి పొన్నం పర్యటన**

**సిద్దిపేట, అక్టోబర్ 30:** సిద్దిపేట జిల్లా కోహెడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పర్యటించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులతో మాట్లాడారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉందని.. పూర్తిగా జలమయం అయిందని తెలిపారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నదని.. కొట్టుకుపోయిందని అన్నారు. వర్షాలకు రోడ్లు మొత్తం దెబ్బతిన్నాయని చెప్పారు. ఇప్పుడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని.. హుస్నాబాద్‌లో పర్యటించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశామన్నారు. రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాలకు అతీతంగా రైతాంగాన్ని ఆదుకోవాలని.. ఇక్కడ పర్యటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం తీసుకొని బాధ్యతగా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు ప్రజల మధ్యే ఉండి నష్టపోయిన పంటలను అంచనా వేయాలని, భారీ వరదలకు జరిగిన నష్టాన్ని మొత్తం రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు





# హన్మకొండలో మేయర్, కమిషనర్ల వాహనాలు అడ్డగింత

హన్మకొండసమ్మయ్యనగర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కమిషనర్ చాహత్ , మేయర్ సుధారాణి వాహనాలను వరద బాధితులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తులసి బార్ దగ్గర గేట్లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. గోపాల్‌పూర్ చెరువు మత్తడి వద్ద గేట్లు మూసివేయడంతోనే గండిపడి వరద తీవ్రత పెరిగిందని సమ్మయ్య నగర్ వాసులు ఆందోళన చేపట్టారు. అధికారులు ముందస్తు చర్యలు చేపడితే ఈ పరిస్థితులు ఉండేవి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, హనుమకొండలో వరద ఉద్రిక్తత ఏర్పడింది. మొంథా తుఫాన్ కారణంగా పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలకు రోడ్లు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల ఇళ్ళలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ శాఖ సైతం హనుమకొండ, వరంగల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శుక్రవారం 31 అక్టోబర్ 2025 కరీంనగర్ 3

# జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

- మైనార్టీ ఓట్లకు గాలం వేసిన కాంగ్రెస్
- అజారుద్దీన్‌కు మంత్రి పదవిపై విమర్శలు
- బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం




**హైదరాబాద్, అక్టోబర్ 30:** నవంబర్ 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల బరిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపాయి. అయితే ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించి.. తమ సత్తా చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ఇక బీఆర్ఎస్ పార్టీ ఈ స్థానాన్ని మళ్లీ కైవసం చేసుకోవాలని కృత నిశ్చయంతో ఉంది. అందుకోసం ఈ అసెంబ్లీ స్థానం నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మాగంటి గోపినాథ్ గెలిచారు. అనారోగ్య కారణంగా ఆయన జూన్‌లో మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య సునీతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించింది. అలాగే బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డిని బరిలో నిలిపింది. గత ఎన్నికల్లో ఆయన ఇదే స్థానం నుంచి గెలిచి మూడో స్థానంలో ఆయన నిలిచిన విషయం విదితమే. మరో వైపు ఈ నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపుపై మైనార్టీల ఓట్లు అధిక ప్రభావం చూపిస్తుంది. కానీ రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ముస్లిం మంత్రి ఒక్కరు కూడా లేరు. దీనిని ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇలాంటి వేళ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2023 ఏడాది చివరిల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అజారుద్దీన్ బరిలో నిలిచి.. రెండో స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో అజారుద్దీన్‌తోపాటు తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ. కొదండరామ్‌ను గవర్నర్ కోటాలో శాసనమండలికి పంపాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన దస్త్రాన్ని గవర్నర్‌కు పంపింది. కానీ దీనికి గవర్నర్ ఆమోదం లభించలేదు. దీంతో అజారుద్దీన్‌కు తొలుత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది. దీనికి బీఆర్ఎస్, బీజేపీలో మోకాలడ్డుతున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు గుప్పిస్తోంది. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నవంబర్ 11వ తేదీన జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న వెలువడనున్నాయి. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు బీజేపీ ఎత్తులు వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. అందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సరెండర్ అయిందని.. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్‌కు బీజేపీ సరెండర్ అయిందని ఆరోపించారు. ఆ క్రమంలోనే బీఆర్ఎస్‌కు లబ్ది చేకూర్చేందుకే అజారుద్దీన్‌పై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఫిర్యాదు చేసిందని తెలిపారు. అజారు-ద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం జరగకుండా ఉండేందుకు గవర్నర్‌పై బీజేపీ ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెలుపల ఎన్నికల కోడ్ లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో విలేకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విలేకర్లతో మాట్లాడుతూ.. రాజస్థాన్‌లోని కరగ్‌పూర్ నియోజకవర్గంలో పోలింగ్‌కు ముందు అభ్యర్థిని మంత్రిగా బీజేపీ ప్రకటించిందన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అజారుద్దీన్.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అభ్యర్థి కూడా కాదు. అయినా అభ్యంతరం ఎందుకు అంటూ సందేహం వ్యక్తం చేశారు.అ అయితే తమ ప్రభుత్వానికి స్పష్టత, సంకల్పం ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# మంత్రివర్గ విస్తరణను వెంటనే ఆపాలి

- అజారుద్దీన్‌కు పదవి కేవలం మైనార్టీలను దువ్వడమే
- జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసే చర్య
- ఎన్నికల అధికారికి బీజేపీ నేతల ఫిర్యాదు



**హైదరాబాద్, అక్టోబర్ 30:** జూబ్లీహిల్స్ ఓటర్లను ప్రభావితం చేసేలా చేస్తున్న మంత్రివర్గ విస్తరణను ఆపాలని బీజేపీ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇది కేవలం ఓ వర్గం వారిని మచ్చిక చేసుకునే చర్య తప్ప మరోటి కాదని పేర్కొంది. ఓ వర్గం ఓట్ల కోసమే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ చేపట్టారని విమర్శించారు. అజారుద్దీన్ గతంలో జూబ్లీహిల్స్‌లో పోటీ చేశారని భాజపా నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణను ఆపాలని సీఈవోను కోరారు. తెలంగాణ భాజపా నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డిని కలిశారు. మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తోందని అందులో పేర్కొన్నారు. మంత్రివర్గంలోకి అజారుద్దీన్‌ను తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్ణయించారు. ఈ నెల 31న విస్తరణకు అవకాశం ఉందని, అజారుద్దీన్‌కు ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరగవచ్చని కూడా తెలుస్తోంది. ఈక్రమంలో సీఈవోను భాజపా నేతలు కలిసి ఫిర్యాదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయన్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని అంటూ పాయల్ శంకర్ అన్నారు. ఒకవేళ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాలి అనుకుంటే ఎన్నిక తర్వాత ఇవ్వాలి. కానీ ఉన్నఫళంగా మంత్రివర్గ విస్తరణ చేయడం, అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. మర్రి శషిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల లబ్ది కోసం ఒక వర్గం ఓట్లు కోసం అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తున్నారు. ఆ వర్గంపై ప్రేమ ఉంటే గతంలో ఎందుకు ఇవ్వలేదు. మంత్రి పదవి ఆశ చూపి ఆ వర్గాన్ని మోసం చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. కోడ్ ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాలంటూ కోరాం. సినీ కార్మికులను ప్రభావితం చేసేలా ప్రకటనలు చేయడంకోడ్ ఉల్లంఘనే అవుతుందన్నారు.

# నా రాజకీయ జీవితంపై బురదజల్లే యత్నం

- తరచూ పార్టీ మారుతున్నారంటూ దుష్ప్రచారం
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అసహనం




**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 30:** తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న వార్తలను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఖండించారు. రాజకీయంగా తాను ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఆయనే ప్రెస్ మీట్ పెట్టి చెబుతాను అంటూ క్లారిటీ ఇచ్చారు. పార్టీ మార్పు అంటూ తప్పుడు ప్రచారాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని లక్కారం, చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని చెరువులను పరిశీలించి గంగ పూజను నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలోని చెరువు నిండినప్పుడు కాలనీలు జలమయం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం, రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ..' చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి 500 కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపుదిద్ద బోతున్నాం. చౌటుప్పల్ చెరువుకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తుగా ప్రణాళికలు వేసి దండు మల్కాపురం, లక్కారం వద్ద వరద నీటిని డైవర్ట్ చేయడంతో మున్సిపాలిటీ ప్రజలకు వరద ముప్పు తప్పిందని తెలిపారు. పార్టీ మారుతున్నానని సొంత పార్టీ వాళ్లు, బయట పార్టీ వాళ్లు నాపై కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలు దుష్ప్రచారాలను ఎవరు నమ్మవద్దు. నేను ఏదైనా నిర్ణయం తీసుకున్నట్లయితే స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి మరి ప్రకటిస్తాను. నేను ప్రస్తుతం సిన్సియారిటీ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తను, ఎమ్మెల్యేను.. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే పని చేస్తాను. క్రమశిక్షణ గల కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా కార్యకర్తగా అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కూడా దానికి కట్టుబడి ఉంటా. నా ముందు మునుగోడు అభివృద్ధి తప్ప, మరో ఆలోచన లేదు. నాపై సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారాలను నమ్మవద్దు అంటూ కామెంట్స్ చేశారు.

# హరీష్ రావుకు కవిత దంపతుల పరామర్శ

**హైదరాబాద్, అక్టోబర్ 30:** మాజీ మంత్రి హరీష్‌రావు ఇంటికి కల్వకుంట్ల కవిత వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. భర్తతో కలసి వెళ్లి హరీష్ రావును పరామర్శించారు. రెండు రోజుల క్రితం హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ సందర్భంలో కవిత అంత్యక్రియలకు హాజరుకాలేదు. దీనితో హరీష్‌రావుతో ఉన్న విభేదాల కారణంగానే రాలేదని అనేక ఊహాగానాలు చెలరేగాయి. అయితే మూడు రోజుల తర్వాత, గురువారం ఉదయం కవిత హరీష్‌రావు నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను కలుసుకున్నారు. సత్యనారాయణరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. కాసేపు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పినట్లు తెలుస్తోంది. అయితే.. గతంలో మాజీ మంత్రి హరీష్‌రావుపై సంచలన ఆరోపణలు చేశారు కవిత. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంలో హరీష్‌రావుపై మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై హరీష్‌రావు ప్రత్యక్షంగా స్పందించలేదు. తాను ఉద్యమం నుంచి ఉన్నారని, తన ప్రస్థానం తెరిచిన పుస్తకమంటూ పరోక్షంగా స్పందించారు. కవిత హరీష్‌రావుపై చేసిన ఆరోపణల అనంతరం ఆమె ఆయన ఇంటికి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ తాజా తరుణం అటు బీఆర్ఎస్ ఇటు జాగృతి శ్రేణుల్లో ఆసక్తి రేకెత్తించింది.

# పిల్లల ప్రాణాలతో చెలగాటమొద్దు: సజ్జన్నార్



**హైదరాబాద్,అక్టోబర్ 30:** ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో హ్యాండిల్ పట్టుకొని ఓ ద్విచక్రవాహనదారుడు ప్రమాదకర రీతిలో పిల్లలను స్కూలుకు తీసుకెళ్లిన ఘటనపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పందించారు. గుడిమల్కాపూర్‌లో ఓ వ్యక్తి చిన్నారులను బైక్‌పై ప్రమాదకరంగా తీసుకెళుతుండటంపై 'ప్రమాదమని తెలిసీ ప్రాణాలతో చెలగాటం ఆడడటంపై ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. ఇలా బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు పట్టు తప్పితే బాధ్యలెవరని ప్రశ్నించారు. వర్షంలోనూ పిల్లల చదువుపై ఉన్న శ్రద్ధ.. ట్రాఫిక్ రూల్స్ నేర్పించడంలో ఎందుకు ఉండడం లేదన్నారు. ఇలా ప్రమాదకర ప్రయాణం చేస్తూ చిన్నారుల ప్రాణాలతో చలగాటమాడొద్దని సూచించారు. ప్రజలంతా ఆలోచించాలని, ట్రాఫిక్ రూల్స్ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని ఈ సందర్భంగా సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?


## రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ బండి



**హైదరాబాద్, అక్టోబర్ 30:** ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, సిబ్బంది ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 6 గ్యారంటీలు ఇస్తామని ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏం చేయాలి? మాట తప్పిన కాంగ్రెస్ నేతలపై విజిలెన్స్ దాడులు చేస్తారా? ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 15 లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నా సోయి లేదా? అని ప్రశ్నించారు. సర్టిఫికెట్లు రాక, ఉద్యోగాల్లో చేరలేక, ఉన్నత చదువులకు వెళ్లలేక విద్యార్థులు ఆందోళన పడుతున్నరన్నారు. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే విద్యా సంస్థలు నడిచేదెలా? అధ్యాపకులకు జీతభత్యాలు, అ÷-దదె, మె-యింటెనెన్స్ ఛార్జీలు చెల్లించేదెలా? అని నిలదీశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ పథకానికి తూట్లు పొడుస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఫీజు బకాయిల కోసం ఎందాకైనా పోరాడాన్నారు. కాలేజీలు, విద్యార్థుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు.

# జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు పదవి

## ఎక్స్ వేదికగా కేటీఆర్ ఘాటు విమర్శలు



**హైదరాబాద్, అక్టోబర్ 30:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహిస్తున్నట్లు కనిపిస్తున్నదని చెప్పారు. అందుకే పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతున్నదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తుందన్నారు. అందుకే కాంగ్రెస్, దాని నాయకత్వానికి గుణపాఠం చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సరైన వేదిక అని చెప్పారు. ఈమేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన

## కాంగ్రెస్ అభ్యర్థి యాదవ్‌పై ఈసీకి ఫిర్యాదు

**హైదరాబాద్, అక్టోబర్ 30:** ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. వారం రోజుల్లో బీఆర్ఎస్ కేడర్‌ను లేకుండా చేస్తానన్న నవీన్ యాదవ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నేతలు ప్లలె రవికుమార్, కె.కిషోర్ గౌడ్, రామచంద్రు నాయక్, ఉపేంద్ర చారి ఉన్నారు. ఇటీవల బీఆర్ఎస్ క్యాడర్‌ను ఉద్దేశించి 'గల్లీ దాటరు.. ఇంటిని చూడరు' అంటూ బెదిరించిన ఆయన తాజాగా గులాబీ క్యాడర్‌నే లేకుండా చేస్తానని బెదిరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. తాజాగా ఓ యూట్యూబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సదరు యాంకర్ 'బీఆర్ఎస్ క్యాడర్‌ను లేకుండా చేస్తా అంటున్నారు.. నిజంగా లేకుండా చేస్తారా?' అని ప్రశ్నించగా 'ఏసేస్తా'? వారం రోజుల్లో బీఆర్ఎస్ క్యాడర్ లేకుండా చేస్తా' అంటూ మరోసారి ధమ్కీ ఇచ్చారు. దీనిపైనా సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో స్పందించారు. రౌడీబిడ్డకు టికెట్ ఇస్తే ఇలాంటి బెదిరింపులకే పాల్పడతారు, జూబ్లీహిల్స్ ఓటర్లూ బహుపరాక్ అని పలువురు సూచించారు. అయితే నవీన్‌యాదవ్ ఎన్ని ధమ్కీలు ఇచ్చినా బీఆర్ఎస్ క్యాడర్‌ను ముట్టుకోవడం కూడా సాధ్యం కాదని బీఆర్ఎస్ నేతలు బదులిస్తున్నారు.

# టీజీ సెట్ - 2025 దరఖాస్తు గడువును పొడగింపు

**హైదరాబాద్, అక్టోబర్ 30:** తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్‌షిప్‌కు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్ - 2025 దరఖాస్తు స్వీకరణ గడువును పొడగించినట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా వచ్చే నెల 6వ తేదీలోగా ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రూ.1500 అపరాధ రుసుముతో 14వ తేదీ వరకు, రూ.2000 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు, రూ.3000 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులు ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. డిసెంబర్ నెల రెండో వారంలో పరీక్షలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు 0040-27097733, 8331040950 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# ఓయూ డిగ్రీ పరీక్షల తేదీల ఖరారు

**హైదరాబాద్, అక్టోబర్ 30:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్‌డబ్ల్యూ, బీఎస్సీ, బీబీఏ, బీబీఏ అనాలిటిక్స్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీఏ రిటైల్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ లిలిలి.నీబపజీనితిజీ.జీఇ.తినిలో చూసుకోవచ్చని సూచించారు.



సంపాదకీయం


# సహాయ, పునరావాసం తక్షణ కర్తవ్యం కావాలి!

మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. వాగులు, వంకలు చెరువులు ఏరులయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు మునిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మక్కజోన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం వచ్చినా వరదలు వచ్చినా, తుఫాన్లు వచ్చినా తొలుత నష్టపోయేది మాత్రం రైతన్నలే. ఇరు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీగా నష్టపోయారు. పంటలు నీటమునిగాయి. వరిచేలు నీట మునిగింది. కొన్నిచోట్ల ఆరపోసిన ధాన్యం కొట్టుకు పోయింది. కోతదశకు వచ్చిన పంట నేలకొరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేల ఎకరాల వరకూ వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. నేలకు ఒరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టాలని అధికారులు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట నేలవాలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అరటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ప్రభుత్వాలు తొలుత ఆదుకోవాల్సింది రైతన్నలనే. నివేదికలతో ఆలస్యం చేయకుండా రైతులను తొలుత ఆదుకోవాలి. నీరు చేరడంతో నానిన పంటలను కొనుగోలు చేయాలి. మునిగిన పంటలకు వెంటనే పరిహారం చెల్లిచాలి. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి. అతిభారీ వర్షాలతో వాగులు,వంకలు ఉగ్రరూపం తో ప్రవహిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో, పాతాళగంగ దారిలో కొండచరియలు విరిగిపడ్డాయి. నల్లమలలోనూ చెరువులు, కుంటలు నీటితో నిండిపోయాయి. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. వందల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో తీరం దాటిన మొంథా తీవ్ర తుపాను.. అతిభారీ వర్షాలు, బలమైన గాలులతో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్ని ముంచేసింది. ఇటు తెలంగానలో ఖమ్మం, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలను ముంచెత్తింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ భారీవర్షాలతో వాగులు పొంగి ప్రవహించడంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. సముద్రం 20-30 మీటర్లు ముందు కొచ్చింది. వందల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలవాలడంతో సరఫరా స్తంభించింది. ప్రభుత్వ చర్యలతో చాలాచోట్ల పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. తీరప్రాంత మండలాల్లో గాలుల దెబ్బకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోల్‌కతా-చెన్నై జాతీయరహదారిపై రాకపోకలు నిలిచాయి. ముందే ముప్పును గుర్తించి చాలామందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నంద్యాల పట్టణం మధ్యలో ప్రవహించే కుందూనది, మద్దిలేరు, చామకాలువ కూడా ఉప్పొంగడంతో పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. శ్రీశైలం-హైదరాబాద్ మార్గంలో సున్నిపెంట దాటిన తర్వాత కొండ చరియలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. భారీ వృక్షాలు నేలకూలి రహదారులకు అడ్డంగా పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాలకు జలాశయంలో పెద్దఎత్తున నీరు చేరడంతో విజయనగరం జిల్లా పరిధిలోని తాటిపూడి రిజర్వాయరు గేట్లు ఎత్తేశారు. ఆ నీటి ఉధృతికి విశాఖ జిల్లా భీమిలి మండలంలోని గోస్తనీ నది పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గత వారం రోజుల పాటు ప్రజలను గజగజలాడించిన మొంథా తుఫాను ప్రభావం ఉపశమించడంతో, ప్రమాదం నుండి బయట పడ్డామని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసాయి. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వరదలతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. వరద నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. భారీ వర్షాలతో వరంగల్‌లో రహదారులు నీట మునిగాయి. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తీగల బంజర వద్ద పగిడేరు వాగు ఉధృతంగా పారడంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వాలు పునరుద్దరణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయాలు పక్కన పెట్టి క్షేత్రస్తాయిలో నష్టం అంచనాలు వేసి సహాయ, పునరావాస కార్యక్రమాలు ముమ్మరం చేయాలి. రోడ్లను మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్దరించాలి. పంటల నష్టాలను అంచనా వేసి రైతులకు ముందుగా తాత్కాలిక ఉపశమనం కలిగించాలి. ఇళు వాకిళ్లు కొట్టుకుపోయిన వారిని గుర్తించి వారికి నిత్యావసరాలతో పాటు జీవనోపాధి కింది పరిహారం అందించాలి. యుద్ధప్రాతిపదికన ఇవి చేపడితే తప్ప ప్రజలు కోలుకోలేరు. ప్రభుత్వాలు వెంటనే ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేంద్రం కూడా నివేదికల కోసం ఎదురు చూడకుండా ముందుగా తక్షణ సాయంగా కొంత డబ్బును రాష్ట్రాలకు అందించాలి. అవసరమైతే గ్రామాల వారిగా బాధజతులను గుర్తించి అక్కడిక్కడే పరిహారం చెల్లింపులు చేయాలి. గతంలో లాగా నెలల తరబడి వేచిచూసే ధోరణికి స్వస్తి పలకాలి.

# ముంబైలో 20మంది పిల్లల నిర్బంధం

- విడిపించే క్రమంలో పోలీస్ కాల్పుల్లో వ్యక్తి మృతి



**ముంబై, అక్టోబర్ 30:** ఒక వ్యక్తి సుమారు 20 మంది పిల్లలను స్టూడియోలో నిర్బంధించాడు. తన డిమాండ్లకో ఓసం కొందరితో మాట్లాడాలంటూ వీడియో రిలీజ్ చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. చివరకు పోలీస్ కాల్పుల్లో ఆ వ్యక్తి మరణించాడు. ముంబైలో ఈ సంఘటన జరిగింది. పోవై ప్రాంతంలోని ఆర్‌ఏ స్టూడియోలో యాక్టింగ్ క్లాసులు జరుగుతుంటాయి. రోహిత్ ఆర్య అనే వ్యక్తి ఆ స్టూడియోలో పని చేస్తున్నాడు. అతడికి యూట్యూబ్ ఛానెల్ కూడా ఉన్నది. 4 రోజులుగా రోహిత్ ఆడిషన్లు నిర్వహిస్తున్నాడు. దీంతో గురువారం ఉదయం సుమారు వంద మంది పిల్లలు ఆడిషన్ల కోసం ఆ స్టూడియోకు వచ్చారు. అయితే 80 మంది పిల్లలను అతడు బయటకు వెళ్లనిచ్చాడు. సుమారు 20 మంది పిల్లలను స్టూడియో లోపల ఉంచి నిర్బంధించాడు. దీంతో తమను కాపాడాలంటూ వారు హాహాకారాలు చేశారు. మరోవైపు రోహిత్ ఆర్య ఆ తర్వాత ఒక వీడియో క్లిప్ విడుదల చేశాడు. కొంత మంది వ్యక్తులతో మాట్లాడటం కోసమే పిల్లలను బందీలుగా ఉంచినట్లు తెలిపాడు. తనకు పెద్దగా ఆర్థిక డిమాండ్లు లేవని చెప్పాడు. తన డిమాండ్లు నైతికమైనవని అన్నాడు. పోలీసులు, అధికారులు దూకుడుగా వ్యవహరించవద్దని, తనను రెచ్చగొట్టవద్దని హెచ్చరించాడు. తన డిమాండ్లు నెరవేర్చకపోతే ఆ ప్రాంగణానికి నిప్పు పెడతానని, తనతో పాటు పిల్లలకు హాని జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు. కాగా, పిల్లల కిడ్నాప్, నిర్బంధం గురించి తెలుసుకున్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పెద్ద సంఖ్యలో ఆ స్టూడియో ముందు గుమిగూడారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పిల్లలను కిడ్నాప్ చేసి నిర్బంధించిన రోహిత్ ఆర్యతో మాట్లాడారు. మరోవైపు పిల్లలందరినీ రక్షించి వారి కుటుంబాలకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అతడు ఎందుకు ఇలా చేశాడు అన్నది తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆ వ్యక్తి మానసికంగా అస్థిరంగా ఉన్నట్లు వెల్లడించారు. అయితే పోలీస్ కాల్పుల్లో గాయపడిన అతడ్ని హాస్పిటల్‌కు తరలించగా మరణించాడు. ఈ సంఘటన ముంబైలో కలకలం రేపింది.

# చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట

## అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 30 :** ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట లభించింది. వచ్చే ఏడాది ప్రారంభం వరకు అమెరికా ఆంక్షల నుంచి దీనికి మినహాయింపు దొరికింది. అమెరికా గతంలో ఇచ్చిన మినహాయింపునకు నేటితో గడువు ముగిసిన నేపథ్యంలో మళ్లీ ఈ గడువు పొడిగింపు వచ్చింది. దీంతో చాబహార్ పోర్ట్‌లోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణకు భారత్‌కు వీలు కలిగింది. చాబహార్ పోర్టుపై ఆరు నెలల పాటు ఈ ఆంక్షల మినహాయింపు ఉందని భారత ప్రభుత్వం ధ్రువీకరించింది. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం నెరపడానికి చాబహార్ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో భారత్‌దే కీలక పాత్ర. ఇప్పటికే న్యూదిల్లీ ఈ ప్రాజెక్టులో భారీగా పెట్టుబడులు పెట్టింది. కజఖిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాలకు భారత్ ఇక్కడినుంచి సరకు రవాణా చేయవచ్చు. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను కూడా ఈ మార్గంలోనే పంపిస్తున్నారు. ఇదిలాఉంటే.. ఈ ఓడరేవులో 10ఏళ్ల పాటు టెర్మినల్ నిర్వహణ కోసం గత ఏడాది భారత్-ఇరాన్ (ఐపీజీఎల్-ఎస్‌ఎంఏ)ల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం తర్వాత భారత్‌కు అమెరికా హెచ్చరికలు చేసింది. ఇరాన్‌పై అమెరికా కొన్ని ఆంక్షలు విధించింది. వాటి అమలు కొనసాగుతూనే ఉంటుంది. ఏ సంస్థ అయినా, దేశమైనా టెహ్రాన్‌తో వ్యాపార లావాదేవీలు జరిపితే.. వారు కూడా వాటి పరిధిలోకి వస్తారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించింది. ఆ ఒప్పందాన్ని సంకుచిత దృష్టితో చూడకూడదని అప్పట్లో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కౌంటర్ ఇచ్చారు.



## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

# జస్టిస్ సూర్యకాంత్

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ విడుదల



**న్యూఢిల్లీ, అక్టోబర్ 30:** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు. అయితే సుప్రీంకోర్టులో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బాధ్యతలు చేపట్టనున్న ఆయకు హృదయపూర్వక అభినందలు, శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుమల కల్తీ నెయ్యి కేసు

## చిన్న అప్పన్న రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు



**తిరుమల, అక్టోబర్ 30:** తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు కీలక మలుపు తిరిగింది. కల్తీ నెయ్యి సరఫరా వెనుక భారీ కుట్ర ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సన్నిహితుడు చిన్నఅప్పన్న అరెస్టుతో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు అప్పన్న రిమాండ్ రిపోర్టులో కుట్ర కోణాలను సిట్ ప్రస్తావించింది. 2022 తితిదే కొనుగోళ్ల విభాగం జీఎంను అప్పన్న సంప్రదించారు. నెయ్యి సరఫరా చేసే భోలేబాబా డెయిరీ యాజమాన్యానికి ఫోన్ చేశారు. ప్రతి కిలో నెయ్యిపై రూ.25 కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు భోలేబాబా డెయిరీ యాజమాన్యం నిరాకరించింది. దీంతో ఆ డెయిరీపై అనర్హత వేటు వేసేలా చిన్నఅప్పన్న కుట్రకు తెరలేపారు. డెయిరీని తనిఖీ చేయాలంటూ తితిదే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. డెయిరీపై అనర్హతవేటు వేసేలా అజ్ఞాతవ్యక్తులతో పిటిషన్లు వేయించారు. చిన్నఅప్పన్న కుట్రతో బోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి సేకరణను తితిదే నిలిపివేసింది. ఆ స్థానంలో ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థ ప్రవేశించి.. రూ.138 ఎక్కువ కోట్ చేసింది. పోటీ లేకపోవడంతో కాంట్రాక్టు దక్కించుకుంది. కల్తీ నెయ్యి కేసులో అప్పన్నను 24వ నిందితుడిగా చేర్చింది.



# విమానంలో గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

**హైదరాబాద్,అక్టోబర్ 30:** జెడ్డా నుంచి శంషాబాద్ వస్తున్న విమానంలో ప్రయాణికుడికి గుండెపోటు వచ్చింది. జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానంలో నగరంలోని అంబర్‌పేటకు చెందిన మహ్మద్ ఖాసీం(79)కు ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ అవుతుందనగా చాతీలో నొప్పి వస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి చెప్పారు. వారు అతనికి సీపీఆర్ చేశారు. ఉదయం 9.27 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ అయిన వెంటనే ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఖాసీంను పరిశీలించిన డాక్టర్లు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో అంబర్‌పేటలోని స్వగ్రహానికి తరలించారు.

# మరో 2వేలు తగ్గిన పసిడి ధరలు

**హైదరాబాద్, అక్టోబర్ 30:** బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీపావళి సమయంలో రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర, ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాల వల్ల పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గుతున్నాయి. గత రెండు వారాల్లో పసిడి భారీగా తగ్గింది. ఈ క్రమంలో బంగారం ధర గురువారం కూడా భారీగా పడిపోయింది. దాదాపు రూ.2 వేలు తగ్గింది. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా బంగారం ధరలు పతనమవుతున్నాయి. భారత్‌లో నిన్న 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం రూ.1,22,400 ఉంది. గురువారం రూ.1,910 మేర తగ్గి రూ.1,20,490 చేరింది. దీంతో పసిడి ప్రియులు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.

## బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

**మంత్రి కొండా సురేఖ**



**నేటి సాక్షి, వరంగల్ టౌన్:** వరంగల్ పరిధిలోని ఎన్ఎన్ నగర్, బీఆర్ నగర్ వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, అదనపు కలెక్టర్లతో కలిసి మంత్రి కొండా సురేఖ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ప్రజలు ఆందోళన చెందవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వరద ముంపు బాధితులను పరామర్శించి, కొనసాగుతున్న సహాయక చర్యలను సమీక్షించారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంత్రి వెంట ఆకుతోట భాగ్యలక్ష్మి రవి, మీసాల ప్రకాశ్, నవీన్ రాజు తదితరులుపాల్గొన్నారు.

# 2036 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసింది

**రైతు వారీగా వివరాలు సేకరించాలి**

**బాధితులకు వెంటనే పరిహారం అందించాలి**

**కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**



**నేటి సాక్షి, కరీంనగర్:** వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా సుమారు 2036 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని, రైతు వారీగా వివరాలు సేకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. వర్షాలతో జరిగిన పంట, ఆస్తి నష్టంపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా జిల్లాలో ఎనిమిది పశువులు చనిపోయాయని, వీటి యజమానులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ఇండ్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిహారం అందజేయాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించాలని, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లను సమృద్ధిగా ఉంచి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం తగ్గిన వెంటనే పత్తి కొనుగోలు ప్రారంభించాలన్నారు. వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో నీరు పారుతున్న ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. చెరువులు, కుంటల నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నగరంలో నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమల వ్యాప్తి నిరోధానికి చర్యలు తీసుకోవాలని, వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగం అజరామరం

- సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బీ గితే
- పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ

**నేటి సాక్షి, సిరిసిల్ల:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వారిని స్మరిస్తూ జిల్లా కేంద్రంలో నేతన్న చౌరస్తా నుంచి అంబేద్కర్ మీదుగా గాంధీ చౌరస్తా వరకు ఎస్పీ ఎస్పీ మహేశ్ బీ గితే ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులను ప్రజలు మరువొద్దని, వారి త్యాగాల ఫలితమే నేడు ప్రశాంత వాతవరణం నెలకొందన్నారు. ప్రజాక్షేమం కోసం పనిచేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి సంవత్సరం అమరవీరుల సంస్మరణ వారోత్సవలు నిర్వహిస్తున్నమని, అందులో భాగంగా ఈ ఏడాది వారిని స్మరిస్తూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, సైకిల్, 2కే రన్, వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిలిమ్స్, ఓపెన్ హౌస్ కార్యక్రమలు నిర్వహించామని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారి ఆశయ సాధన కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్ఐలు రమేశ్, యాదగిరి, మధుకర్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# డయాబెటిస్ ఉన్నవారికి కొబ్బరినూనె మేలు

డయాబెటిస్ అనేది ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. దీని బారిన పడుతున్న వారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా యుక్త వయస్సులో ఉన్నవారు అధిక శాతం మంది టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అస్తవ్యవస్తమైన జీవన శైలి ఈ వ్యాధి వచ్చేందుకు ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఆహారం విషయంలో చాలా మంది తగు జాగ్రత్తలు పాటించడం లేదని, దీని వల్లే టైప్ 2 డయాబెటిస్ వస్తుందని అంటున్నారు. డయాబెటిస్ వచ్చిన వారు ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. లేదంటే వ్యాధి మరింత ముదిరే ప్రమాదం ఉంటుంది. ఆహారంలో పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకోవడం పూర్తిగా తగ్గించాలి. లేదా మానేస్తే మంచిది. ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకుంటే మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

**రోజూ ఇలా తీసుకోవాలి..**

డయాబెటిస్ ఉన్నవారు పిండి పదార్థాలు, చక్కెర అధికంగా ఉండే ఆహారాలను తినడం వల్ల శరీరంలో కొవ్వు నిల్వలు పేరుకుపోతాయి. దీంతో ఇన్సులిన్ నిరోధకత మరింత పెరుగుతుంది. దీని వల్ల షుగర్ మరింత ఎక్కువవుతుంది. కనుక ఆయా ఆహారాలను తీసుకోవడం పూర్తిగా తగ్గించాల్సి ఉంటుంది. ఫైబర్ ఉండే ఆహారాలను తినాలి. దీని వల్ల షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అయితే డయాబెటిస్ ఉన్నవారు కొబ్బరినూనెను ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కొబ్బరినూనె డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని అంటున్నారు. కొబ్బరినూనెను రోజూ వంట నూనెగా ఉపయోగించవచ్చు. లేదా రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ మోతాదులో తీసుకోవచ్చు. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

**ఇన్సులిన్ నిరోధకతకు..**

డయాబెటిస్ ఉన్నవారు రోజూ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచవచ్చు. దీంతో ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారికి సహజంగానే అజీర్తి సమస్య ఉంటుంది. ఆహారం జీర్ణమవడం ఆలస్యం అవుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకుంటే ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. అలాగే షుగర్ ఉంటే మలబద్దకం కూడా ఇబ్బంది పెడుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల మలబద్దకం అన్న మాటే ఉండదు. రోజూ ఉదయం సుఖంగా విరేచనం అవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది.

**ఇన్‌ఫెక్షన్లకు చెక్..**

కొబ్బరినూనెను సేవించడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. కొబ్బరినూనె యాంటీ మైక్రోబియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారికి తరచూ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. కనుక వారు కొబ్బరినూనెను తీసుకుంటే ఇన్‌ఫెక్షన్‌లకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా చర్మంపై, జననావయవాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. చర్మం పొడిబారకుండా చూస్తుంది. చర్మం కాంతివంతంగా కనిపించేలా చేస్తుంది. అలాగే శిరోజాలు దృఢంగా ఆరోగ్యంగా ఉంటాయి. జుట్టు రాలడం తగ్గిపోతుంది. డయాబెటిస్ ఉన్నవారు కొబ్బరినూనెను తీసుకుంటే ఇలా అనేక రకాలుగా లాభాలను పొందవచ్చు.

# పీనట్ బటర్ ఆరోగ్యకరమైందేనా..?

**దీన్ని రోజుకు ఎంత తినాలి..? దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయి..?**

మార్కెట్‌లో మనకు అనేక రకాల ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. చాలా రకాల ఆహారాలు మనకు ప్రకృతి సహజసిద్ధంగా అందిస్తుంది. కొన్ని రకాల ఆహారాలను మనం తయారు చేసుకుని తింటాం. వాటిల్లో ఆరోగ్యకరమైనవి, అనారోగ్యకరమైనవి కూడా ఉంటాయి. అయితే ఆరోగ్యకరమైన ఆహారాల విషయానికి వస్తే వాటిల్లో పీనట్ బటర్ కూడా ఒకటి. పల్లీల నుంచి దీన్ని తయారు చేస్తారు. సాధారణంగా చాలా మంది దీన్ని అనారోగ్యకరమైన ఆహారం అని భావిస్తారు. ఎందుకంటే ఇందులో కొవ్వులు, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి కనుక దీన్ని తినకూడదని, ప్రమాదమని అనుకుంటారు. కానీ ఇందులో నిజం లేదు. ఎందుకంటే పీనట్ బటర్ వాస్తవానికి ఆరోగ్యకరమైనదే. కానీ ఇందులో చక్కెరలు, అనారోగ్యకరమైన కొవ్వులు, ఉప్పు వంటి ఆహారాలను కలపకుండా తయారు చేసింది అయి ఉండాలి. అలాంటి పీనట్ బటర్‌నే మనం తినాల్సి ఉంటుంది. మార్కెట్‌లో చాలా రకాల పీనట్ బటర్ బ్రాండ్లు మనకు లభిస్తున్నాయి. కనుక వాటిని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

**ప్రోటీన్లు అధికం..**

ఎలాంటి కృత్రిమ పదార్థాలు, చక్కెర, ఉప్పు లాంటి పదార్థాలను కలపకుండా తయారు చేసిన పీనట్ బటర్ అయితేనే మనం ఉపయోగించాలి. అలాంటి పీనట్ బటర్‌ను తింటేనే ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి. పీనట్ బటర్ మనకు అనేక లాభాలను అందిస్తుంది. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనకు అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మాంసాహారం తినని వారికి కావల్సిన ప్రోటీన్లను పీనట్ బటర్ అందిస్తుంది. ఇందులో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి కండరాల కణజాలానికి మరమ్మత్తులు చేస్తాయి. దీని వల్ల కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. శరీరానికి శక్తి లభిస్తుంది. పీనట్ బటర్‌ను తింటే ఆరోగ్యకరమైన కొవ్వులను పొందవచ్చు. ఇందులో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి మంచి కొవ్వుల జాబితాకు చెందుతాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

**కండరాల ఆరోగ్యానికి..**

పీనట్ బటర్‌లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. విటమిన్ ఇ వల్ల చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పీనట్ బటర్‌ను తింటే అధిక మొత్తంలో మెగ్నిషియం లభిస్తుంది. ఇది కండరాలను దృఢంగా ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. నాడీ మండల వ్యవస్థ చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతుంది. దీంతో ఉత్సాహంగా ఉంటారు.



యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. పీనట్ బటర్‌లో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ బి3 అధికంగా ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారం సులభంగా శక్తిగా మారేందుకు దోహదం చేస్తుంది. దీని వల్ల శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి.

**హైబీపీ ఉన్నవారికి..**

పీనట్ బటర్‌లో అధికంగా ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. శరీరంలో సోడియం స్థాయిలను తగ్గించి బీపీ అదుపులో ఉండేలా చేస్తుంది. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుతుంది. పీనట్ బటర్‌ను తింటే జింక్ కూడా అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఈ విధంగా పీనట్ బటర్ మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అయితే మార్కెట్‌లో ఏ పీనట్ బటర్ పడితే దాన్ని కొనకూడదు. కృత్రిమ పదార్థాలు లేని పీనట్ బటర్‌ను కొని వాడితే మేలు జరుగుతుంది. ఇక దీన్ని రోజుకు 2 టేబుల్ స్పూన్లకు మించి తినకూడదు. అలర్జీలు ఉన్నవారు పీనట్ బటర్‌ను తినకూడదు. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ దీన్ని తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ**



**నేటి సాక్షి, వేములవాడ:** వర్షాల నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని తేమశాతం పరిగణలోకి తీసుకోకుండా కొనుగోలు చేయాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ డిమాండ్ చేశారు. గురువారం గంభీరావుపేట మండల కేంద్రంలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి పంటలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రోజులు గడుస్తున్న 40 లారీల ధాన్యం ఇప్పటివరకు తరలించాల్సి ఉండగా, రెండు లారీలను మాత్రమే తరలించారని మండిపడ్డారు. తుఫాను వల్ల కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తేమశాతాన్ని పరిగణలోకి తీసుకోకుండా ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.



ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివ కేశవ ఆలయానికి గురువారం ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన మాజీ సెస్ డైరెక్టర్ కుంభాల మల్లారెడ్డి హుండీ బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

- నేటి సాక్షి, సిరిసిల్ల

# మోత్కులపల్లి వాగులో దంపతులు గల్లంతు

**నేటి సాక్షి, హుస్నాబాద్:** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మోత్కులపల్లి వాగులో విషాదం చోటుచేసుకుంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి చెందిన ప్రణయ్, కల్పన దంపతులు బుధవారం రాత్రి తమ ద్విచక్ర వాహనంపై అక్కన్నపేటకు బయలుదేరారు. కాగా వరద ప్రవాహానికి మల్లారం వద్ద రోడ్డు తెగిపోవడంతో వారు వేరే దారి గుండా మోత్కులపల్లి వైపు ప్రయాణిస్తున్నారు. రాత్రి వాగు దాటే ప్రయత్నంలో ద్విచక్ర వాహనంతో సహా వరద నీటిలో ఇద్దరూ కొట్టుకుపోయారు. ఇదిలాఉండగా గురువారం ఉదయం పొలాలకు వెల్తున్న రైతులు చెరువు సమీపంలో బైక్ కనపడడంతో పోలీసులకు అక్కన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బైక్ నంబర్ ఆధారంగా గల్లంతైన వారి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఈ ఘటనపై సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్ఎం విజయ్‌కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెస్క్యూ బృందాలకు గాలింపు చర్యలను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ కుశాల్కర్, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎస్ఐ లక్ష్మారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# తుది దశలో ఉన్న ఇండ్లను పూర్తి చేయాలి


- గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి
- ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటిదాకా దాదాపు రూ. 49 కోట్ల 85 లక్షల ఆర్థిక సాయం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ
- వివిధ దశల్లో ఉన్న ఇండ్లు వేగంగా నిర్మించాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష



**నేటి సాక్షి, సిరిసిల్ల:** జిల్లాలో తుది దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి, గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం హౌసింగ్, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మొత్తం 7918 ఇండ్లు మంజూరు చేయగా, 5361 ఇండ్లకు ముగ్గు పోయడం జరిగిందని, 2042 బేస్ మెంట్ లెవెల్, 1011 గోడల లెవెల్, 962 స్లాబ్ లెవెల్ ఉండగా, 8 ఇండ్లు పూర్తి అయ్యాయని, ఇండ్ల లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఇప్పటిదాకా రూ. 49 కోట్ల 85 లక్షల ఆర్థిక సహాయం జమ అయిందని తెలిపారు. నిరుపేదలకు ఇండ్లు ఖచ్చితంగా ఉండాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిందని వెల్లడించారు. అన్ని మండలాల్లో నిర్మాణం పూర్తయిన ఇండ్లను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని సూచించారు. ప్రతీ మండలంలో వారం రోజుల్లో కనీసం ఒక్కో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన కోనరావుపేట మండల అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి, అన్ని ఇండ్లను పూర్తి చేసేలా చూడాలని పిలుపు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా మంజూరైన ఇండ్ల నిర్మాణం కోసం మార్కింగ్ తప్పనిసరిగా చేయాలని, పనులు వేగంగా పూర్తి చేసేలా రోజు పర్యవేక్షణ చేస్తూ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. లబ్దిదారులు ఇండ్లు నిర్మించుకోవడం, పనులు వేగవంతం చేసేందుకు అధికారులు స్వయంగా వెళ్ళి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. లబ్దిదారులకు పనులు ప్రారంభించేందుకు అవసరమైన వారికి ఐకేపీ, మెప్మా మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, వారం తర్వాత మళ్లీ సమీక్ష నిర్వహిస్తాను, వచ్చే సమీక్ష వరకు ప్రగతి సాధించాలని పేర్కొన్నారు. ప్రతీరోజూ తమ పరిధిలోని గ్రామాలను ఎంపీడీఓ లు సందర్శించి, ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా పర్యవేక్షించాలని, ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన సామగ్రి ధరల నియంత్రణ, తదితర అంశాలపై యజమానులతో లేబర్ అధికారి సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇసుకకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తహశీల్దార్లతో సమన్వయం చేసుకుని ఇండ్ల నిర్మాణాల ప్రగతిని పెంచాలని, ఇప్పటివరకు ఇండ్ల నిర్మాణాలు ఏయే గ్రామాల్లో ప్రారంభించలేదో దానికి సంబంధించిన వివరాలను గృహనిర్మాణ శాఖ పీడీకి సూచించారు. ప్రతి అధికారి తమ హయాంలో ఇండ్లు నిర్మించి ఇస్తే అది మర్చిపోలేని అనుభూతి అని వివరించారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, హౌసింగ్ పీడీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఇవ్వాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**నేటి సాక్షి, సిరిసిల్ల:** జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు తప్పకుండా ఇవ్వాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈఎంఆర్ఎస్ గురుకులాల డీసీఓలు, జిసిడిఓ, డీఈఓతో జిల్లా సమీకృత కార్యాలయల సముదాయంలోని ఆడిటోరియంలో గురువారం ఇంచార్జి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అన్ని విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితర వివరాలపై ఆ యొక్క ఆయా విద్య సంస్థల డిసిఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. అన్ని విభాగాల విద్యాలయాల్లో డైనింగ్ హాల్లో మెనూకు సంబంధించిన పూర్తి వివరాలతో పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆహార పదార్థాలకు వినియోగించే అన్ని వివరాల రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని సూచించారు. విద్యాలయాలకు కాంట్రాక్టర్ సరఫరా చేసే కోడిగుడ్లు, చికెన్, మటన్ ఇతర ఆహార పదార్థాల నాణ్యతను కచ్చితంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. ఏమైనా లోపం ఉంటే వెంటనే తిప్పి పంపాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆహార పదార్థాలు సిద్ధం చేసే సిబ్బంది కచ్చితంగా మాస్కులు ధరించాలని, కిచెన్, డైనింగ్ హాల్ ఇతర ఆవరణలో పరిశుభ్రంగా ఉంచాలని, శుద్ధమైన నీటిని విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యాలయాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఇంకా ఏమైనా ఇబ్బందులు అయితే వెంటనే జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి విద్యాలయంలో ఫుడ్ టెస్ట్ ఆఫీసర్ ఉండాలని వారు ఆహార పదార్థాలు రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు ఇవ్వాలని ఆదేశించారు. అన్ని విద్యాలయాల్లో అన్ అకాడమీ ఇతర పోటీపరీక్షల శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయా? అని ఆరా తీశారు. ఏ ఏ సమయంలో విద్యార్థులకు అందిస్తున్నారు డైలీ పరీక్షలు పెడుతున్నారా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని విద్యాలయాల్లో సివిల్ ఇతర పనులు ఏమైనా మంజూరు అయ్యాయా? వాటి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయా విద్యాలయాల బాధ్యులు పూర్తి వివరాలతో ప్రతిపాదనలు అందించాలని దానిపై సమీక్ష చేసి ఆయా పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ వినోద్ కుమార్, డిప్యూటీ డీఈఓ లక్ష్మీరాజం, వివిధ విద్యాలయాల ఎస్సీ, బీసీ, మైనార్టీ డీసీఓలు రవీందర్ రెడ్డి, సౌజన్య, భారతి, జీసీడీఓ పద్మజ, ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# మిల్లుల్లో ధాన్యం వెంటనే అన్‌లోడ్ చేయాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మల్కపేట కొనుగోలు కేంద్రం తనిఖీ
- కొండాపూర్ లో లెవెల్ కల్వర్టుకు మరమ్మత్తు చేయాలి
- వెంకట్రావుపేట చెరువు పరిశీలన



**నేటి సాక్షి, కోనరావుపేట:** కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లులో అన్ లోడ్ చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కోనరావుపేట మండలం మల్కపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వడ్ల కుప్పలు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు అందుబాటులో ఉండాలని, అన్ని వసతులు కల్పించాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైస్ మిల్లర్ తో స్వయంగా ఫోన్లో మాట్లాడి కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఆపకుండా వెంటనే అన్ లోడ్ చేయాలని సూచించారు. కొండాపూర్ గ్రామ శివారులో గల లో లెవెల్ కల్వర్టుకు మరమ్మత్తు చేసి రాకపోకలు పునరుద్ధరించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వర్షానికి పెంటివాగు ప్రవహించి కొండాపూర్ లో లెవెల్ కల్వర్టు దెబ్బతినగా, గురువారం ఇంచార్జి కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కల్వర్టుకు పక్కాగా మరమ్మత్తులు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు.

## వెంకట్రావుపేట చెరువు పరిశీలన

వెంకట్రావుపేటలోని ఘట్ ఘట్ చెరువు లీకేజీ కాగా, రోడ్డు నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ అధికారులతో కలిసి కాలినడకన వెళ్లి పరిశీలించారు. చెరువు సామర్థ్యం, పరివాహక ప్రాంతం ఇతర వివరాలు నీటి పారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రవహిస్తున్న వరద కాలువను దాటి చెరువు కట్ట మీదికి వెళ్లి పరిశీలించారు. కట్టకు ప్రమాదం లేకుండా స్లూయిజ్ గేట్లు, మత్తడి ద్వారా వరద ప్రవాహాన్ని కింద ఉన్న కేశవరావు చెరువుకు పంపిస్తున్నట్లు అధికారులు ఇంచార్జి కలెక్టర్ కు వివరించారు. నీటి సామర్థ్యం తగ్గిన తర్వాత పూర్తి స్థాయిలో లీకేజీ కి మరమ్మత్తులు చేపట్టాలని నీటి పారుదల శాఖ అధికారులను ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ జిల్లా నీటిపారుదల శాఖ అధికారి కిషోర్ కుమార్, ఆర్ అండ్‌బీ ఈఈ నరసింహ చారి, జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్ర ప్రకాష్, ఆర్అండ్‌బీ డీఈ శాంతయ్య, నీటి పారుదల శాఖ డీఈ క్రాంతి కుమార్, ఎంపీడీఓ, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు 'రన్ ఫర్ యూనిటీ'

**నేటి సాక్షి, సిరిసిల్ల:** జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించే రన్ ఫర్ యూనిటీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఎస్పీ మహేశ్ బీగితే గురువారం ఆవిష్కరించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం ఏడు గంటలకు జిల్లాలో కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు రన్ ఫర్ యూనిటీ 2కే రన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమంలో భాగంగా రన్ నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ రన్‌లో ప్రజలు, విద్యార్థులు, యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని ఐక్యత, జాతీయ సమైక్యత స్ఫూర్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఫైనల్‌లో భారత్

## జెమీమా సెంచరీ
## రాణించిన హర్మన్
## సెమీ ఫైనల్‌లో ఆసీస్‌పై
## రికార్డు విజయం
## మహిళల ప్రపంచకప్




నవీముంబై: మహిళల వన్డే ప్రపంచకప్ 2025 టైటిల్‌కు టీమిండియా అడుగు దూరంలో నిలిచింది. 52 ఏళ్ల నిరీక్షణకు తెరదించేందుకు చేరువైంది. అసాధారణ ప్రదర్శనతో అద్వితీయమైన విజయంతో హర్మన్‌సేన ఫైనల్ చేరింది. గురువారం నవీ ముంబై వేదికగా జరిగిన సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన టీమిండియా 5 వికెట్ల తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆసీస్‌ను ఓడించింది. జెమీమా అజేయ శతకంతో టీమిండియా విజయకేతనం ఎగరవేసింది. ఈ టోర్నీలో ఓటమెరుగని ఆసీస్‌కు పరాజయం రుచి చూపించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (93 బంతుల్లో 17 ఫఫోర్లు, 3 సిక్స్‌లతో 119) విధ్వంసకర శతకంతో చెలరేగగా ఎల్లిస్ పెర్రీ(88 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 77), అష్లే గార్డ్‌నర్(45 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో శ్రీ చరణి(2/49), దీప్తి శర్మ రెండేసి వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్, రాధ యాదవ్ చెరో వికెట్ తీశారు. చరిత్ర సృష్టించిన భారత్ అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 48.3 ఓవర్లలో 5 వికెట్లకు 341 పరుగులు చేసి గెలుపొందింది. జెమీమా రోడ్రిగ్స్(134 బంతుల్లో 14 ఫోర్లతో 127 నాటౌట్) అజేయ శతకంతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. హర్మన్‌ప్రీత్ కౌర్(88 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 89) హాఫ్ సెంచరీతో సత్తా చాటింది. ఆసీస్ బౌలర్లలో కిమ్ గార్త్(2/46), అన్నబెల్ సదర్లాండ్(2/69) రెండేసి వికెట్లు తీసారు. చెత్త ఫీల్డింగ్‌తో ఆస్ట్రేలియా విజయాన్ని చేజార్చుకుంది. జెమీమా ఇచ్చిన మూడు సునాయస క్యాచ్‌లను నేలపాలు చేసి మూల్యం చెల్లించుకుంది. ఈ గెలుపుతో టీమిండియా చరిత్ర సృష్టించింది. మహిళల వన్డే క్రికెట్‌లోనే అత్యధిక పరుగులు చేధించిన జట్టుగా నిలిచింది. ఆదివారం నవీ ముంబై వేదికగా జరిగే ఫైనల్లో సౌతాఫ్రికాతో టీమిండియా తలపడనుంది.

### నిరాశపర్చిన ఓపెనర్లు

338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియాకు ఆశించిన శుభారంభం దక్కలేదు. ప్రతికా రావల్ స్థానంలో జట్టులోకి వచ్చిన షెఫాలీ వర్మ(10)తీవ్రంగా నిరాశపర్చింది. రెండు బౌండరీలతో జోరు కనబర్చిన షెఫాలీ వర్మను కిమ్ గర్త్ ఎల్బీగా పెవిలియన్ చేర్చింది. క్రీజులోకి జెమీమా రాగా.. స్మృతి మంధాన ఓ భారీ సిక్సర్‌తో దూకుడు కనబర్చింది. కానీ మంధానను కూడా కిమ్ గార్త్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చింది. అంపైర్ నాటౌటివ్వగా.. రివ్యూతో ఆసీస్ ఫలితం రాబట్టింది. దాంతో పవర్ ప్లేలో భారత్ 2 వికెట్లకు 60 పరుగులే చేసింది.

### ఆదుకున్న జెమీమా, హర్మన్

కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి జెమీమా చెలరేగింది. జెమీమా దూకుడుగా ఆడగా.. క్రీజులో సెట్ అయ్యేందుకు హర్మన్‌ప్రీత్ టైమ్ తీసుకుంది. 57 బంతుల్లో జెమీమా హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా బ్యాట్ ఝులిపించింది. బౌండరీలతో ఆసీస్ బౌలర్లపై ఎదురు దాడికి దిగింది. ఈ క్రమంలో హర్మన్ ప్రీత్ కౌర్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. అనంతరం హర్మన్ మరింత దూకుడుగా ఆడింది. భారీ సిక్సర్లతో విరుచుకుపడింది. 82 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అలనా కింగ్ బౌలింగ్‌లో జెమీమా ఇచ్చిన సునాయస క్యాచ్‌ను వికెట్ కీపర్ అలీసా హీలీ నేలపాలు చేసింది. ఈ అవకాశంతో జెమీమా చెలరేగింది. హర్మన్‌ప్రీత్ కౌర్ సైతం వేగంగా పరుగులు రాబట్టింది. సెంచరీ దిశగా సాగిన ఆమెను సదర్లాండ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చింది. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 167 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

### విజయ శతకం..

క్రీజులోకి వచ్చిన దీప్తి శర్మ కూడా దూకుడు ఆడింది. మూడు బౌండరీలతో జోరు కనబర్చింది. కానీ జెమీమా తప్పిదం కారణంగా ఆమె రనౌట్‌గా వెనుదిరిగింది. దాంతో క్రీజులోకి రిచా ఘోష్ రాగా.. జెమీమా తన క్లాస్ బ్యాటింగ్ కొనసాగించింది. మేఘన్ స్కట్ బౌలింగ్‌లో సింగిల్ తీసి 115 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకుంది. కానీ జెమీమా ఎలాంటి సంబరాలు చేసుకోలేదు. కనీసం బ్యాట్ కూడా ఎత్తలేదు. జట్టు విజయమే తన ముఖ్యమని భావించింది. 106 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద సదర్లాండ్ బౌలింగ్‌లో జెమీమా ఇచ్చిన మరో సునాయస క్యాచ్‌ను మెక్‌గ్రాత్ నేలపాలు చేసింది. రిచా ఘోష్ భారీ సిక్సర్‌తో దూకుడు కనబర్చింది. కానీ అనవసర షాట్‌తో వికెట్ పారేసుకుంది. దాంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. అమన్ జోత్‌తో కలిసి జెమీమా విజయం కోసం పోరాడింది. చివర్లో అమన్ జోత్ కౌర్ రెండు బౌండరీలు బాది విజయలాంఛనాన్ని పూర్తి చేసింది.

### ఆయన వల్లే ఈ విజయం

జీసస్ వల్లే విజయం సాధ్యమైందని, ఆయనే తనను నడిపించాడని చెబుతూ టీమిండియా మహిళా బ్యాటర్, మ్యాచ్ విన్నర్ జెమీమా రోడ్రిగ్స్ కన్నీటి పర్యంతమైంది. మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భాగంగా గురువారం ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్నందుకుంది. ఈ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్(134 బంతుల్లో 14 ఫోర్లతో 127 నాటౌట్) అజేయ శతకంతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. ఆఖరి వరకు క్రీజులో నిలబడి విజయలాంఛనాన్ని పూర్తి చేసింది. జెమీమా అసాధారణ ప్రదర్శనతో టీమిండియా 339 పరుగుల రికార్డ్ లక్ష్యాన్ని ఛేదించి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత శతకంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన జెమీమా.. హెూస్ట్‌తో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమైంది. ఏడుస్తూనే తన ఇన్నింగ్స్ గురించి చెప్పుకొచ్చింది. 'ముందుగా నేను జీసస్‌కు కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. ఎందుకంటే ఆయన వల్లే నేను ఈ ఇన్నింగ్స్ ఆడాను. ఈ రోజు జీసస్ నన్ను నడిపించాడు. నాకు అండగా నిలిచిన మా అమ్మ, నాన్న, కోచ్‌తో పాటు ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు. గత నెల నాకు చాలా కష్టంగా గడిచింది. కానీ ఈ ఇన్నింగ్స్ నాకు ఒక కలలా అనిపిస్తుంది. ఈ విజయం ఇంకా నా మదిలోకి ఎక్కలేదు. నేను స్నానం చేయడానికి వెళ్తుండగా మూడో స్థానంలో బ్యాటింగ్ చేయాలని చెప్పారు. ఎలాగైనా ఈ మ్యాచ్ గెలవాలని అనుకున్నాను. నా కోసం కాకుండా జట్టు కోసమే ఆడాను. గతంలో మేం కీలకమైన మ్యాచ్‌లు ఓడిపోయాం. ఈ సారి ఆ తప్పిదం చేయకూడదని గట్టిగా అనుకున్నాను. హాఫ్ సెంచరీ, సెంచరీ ఏదీ నేను పట్టించుకోలేదు. జట్టు గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. అందుకే సెంచరీని సెలెబ్రేట్ చేసుకోలేదు.

### అప్పుడు రోజు ఏడ్చాను.

గతేడాది ప్రపంచకప్ జట్టులో నాకు చోటు దక్కలేదు. అప్పుడు ఫామ్‌లో ఉన్నా నాకు అవకాశం దక్కలేదు. ఆ సమయంలో నేను తీవ్ర మానసిక వేధనను అనుభవించాను. ప్రతీ రోజు ఏడుస్తూ కూర్చున్నాను. మరింత ఎక్కువగా కష్టపడి జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాను. నేటి ఇన్నింగ్స్‌లో ఆ దేవుడు నాకు అండగా నిలిచాడు. బ్యాటింగ్ చేసే సమయంలో నాతో నేను ఎక్కువగా మాట్లాడుకున్నాను. బైబిల్‌లో ఒక వ్యాక్యాన్ని పదే పదే ఉటంకించాను. ఆ బైబిల్ వ్యాఖ్యలతో 'నిశ్చలంగా ఉండు.. ఆ దేవుడు నీ కోసం పోరాడుతాడు.'అనే బైబిల్ వ్యాఖ్యాన్ని పదే పదే మనసులో అనుకున్నాను. అందులో ఉన్నట్లుగానే ఆ దేవుడు నా కోసం పోరాడాడు. ఈ విజయం ఇచ్చిన ఆనందాన్ని నేను మాటల్లో చెప్పలేను. హర్మన్ ప్రీత్ కౌర్ వచ్చినప్పుడు మంచి భాగస్వామ్యం నమోదు చేయాలని భావించాం. చివర్లో నేను దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాను. కానీ అది నా వల్ల కాలేదు. దీప్తి శర్మ ప్రతీ బంతికి నాతో మాట్లాడి నన్ను కూల్ చేసింది. నా సహచర ఆటగాళ్లు నాకు అండగా నిలిచారు. ఈ గెలుపు క్రెడిట్ నా ఒక్కదానిదే కాదు. సమష్టిగానే ఈ విజయం దక్కింది. ప్రేక్షకుల మద్దతు, వారి అరుపులు నన్ను మరింత ఉత్సాహపరిచాయి.'అని జెమీమా చెప్పుకొచ్చింది. జెమీమా చెప్పినట్లుగా ఆమెకు దేవుడు అండగా నిలిచాడు. ఆమె ఇచ్చిన మూడు సునాయస క్యాచ్‌లను ఆసీస్ ఆటగాళ్లు వదిలేసారు.




# ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా

## మెల్‌బోర్న్ వేదికగా నేడు రెండో టీ20
## ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగనున్న భారత్
## అర్ష్‌దీప్ సింగ్ ను జట్టులోకి తీసుకునే చాన్స్



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను వరణుడు మింగేయడంతో టీమిండియా మరో ఆసక్తికరమైన పోరుకు సిద్దమైంది. మెల్‌బోర్న్ వేదికగా శుక్రవారం జరిగే రెండో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. వర్షం అంతరాయం కలిగించిన తొలి మ్యాచ్‌లో భారత్ బ్యాటర్లు దుమ్మురేపారు. అదే జోరును రెండో టీ20లోనూ కొనసాగించాలనుకుంటున్నారు. తొలి టీ20లో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ పేసర్లతో పాటు ఓ పేస్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగిన టీమిండియా.. రెండో టీ20లో తమ కాంబినేషన్‌ను మార్చుకునే ఛాన్స్ ఉంది.మెల్ బోర్న్ పిచ్ సాధారణంగా పేస్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇది బౌన్సీ పిచ్. బ్యాటర్లు పరుగుల పండుగ చేసుకుంటారు. మైదానం పెద్దది కాబట్టి స్పిన్నర్లు వికెట్లు తీయకపోయినా.. పరుగులు నియంత్రించే అవకాశం ఉంటుంది. ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. పిచ్ కండిషన్స్‌ను పరిగణలోకి తీసుకుంటే.. టీమిండియా ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగవచ్చు. అప్పుడు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తీలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. అదనపు పేసర్‌గా అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వస్తాడు.ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనున్నారు. తొలి టీ20లో ఈ ఇద్దరు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఏడాది పేలవ ప్రదర్శన కనబర్చిన టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తొలి మ్యాచ్‌తో టచ్‌లోకి వచ్చాడు. తనకు అచ్చొచ్చిన ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగి దుమ్మురేపాడు. తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే మిడిలార్డర్‌లో ఆడనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్ కొనసాగనుండగా.. వికెట్ కీపర్‌గా సంజూకు ప్రాధాన్యత దక్కనుండటంతో జితేష్ శర్మకు మరోసారి నిరాశే ఎదురు కానుంది.స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి జట్టులో కొనసాగనున్నారు. ఎక్స్‌ట్రా పేసర్ కావాలనుకుంటే ఈ ఇద్దరిలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. తొలి టీ20లో అర్ష్‌దీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాను ఆడించడం విమర్శలకు దారి తీసింది. కానీ అతను బ్యాటింగ్ చేయడంతో పాటు ఆసీస్ కండిషన్స్‌లో బాగా రాణించగలడనే కారణంతో తుది జట్టులోకి తీసుకున్నారు. మరోసారి బుమ్రాకు తోడుగా అతన్నే కొనసాగించనున్నారు.

రెండో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)

అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి/అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా.

### ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన భారత టీ20 జట్టు:

సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా,

# ముంబయి ఇండియన్స్‌ను వీడనున్న రోహిత్ శర్మ!?




సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ ఐపీఎల్ ఫ్యూచర్‌పై మరోసారి చర్చ మొదలైంది. వచ్చే సీజన్‌కు అతడు ముంబయి ఇండియన్స్‌ను వదిలి కోల్‌కతా నైట్?రైడర్స్ ఫ్రాంచైజీకి మారనున్నాడని, ఆ దిశగా అడుగులు పడుతున్నాయని రెండు రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. రెండేళ్ల కిందట రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడంతో, వచ్చే సీజన్‌కు రోహిత్ నిజంగానే ముంబయిని వదిలేసి కేకేఆర్‌కు ఆడాలనుకుంటున్నాడేమోనని నెటిజన్లు అనుకుంటున్నారు. దీనికితోడు కోల్‌కతా రీసెంట్‌గా చేసిన ఎక్స్ పోస్టు ఆజ్యం పోసినట్లైంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో 202 పరుగులతో రాణించి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన రోహిత్ వన్డే ర్యాకింగ్స్‌లో రెండు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. దీంతో కెరీర్‌లో తొలిసారి టాప్ ప్లేస్‌లోకి దూసుకెళ్లాడు. దీంతో రోహిత్‌కు మాజీ క్రికెటర్లు, సహచరులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెట్టారు. ఈ క్రమంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ కూడా ఓ పోస్ట్ చేసింది. ఈ పోస్టుకు ఓ నెటిజన్ రిప్లై ఇస్తూ 'కేకేఆర్‌కు రోహిత్ వస్తున్నాడా' అని కామెంట్ చేశాడు. ఈ కామెంట్‌కు కేకేఆర్ 'కన్ఫార్మ్, వరల్డ్ నెం.1 వన్డే బ్యాటర్' అని రిప్లై ఇచ్చింది. దీంతో ఈ వార్తలకు బలం చేకూరింది. 'కన్ఫార్మ్ అంటే అర్థం ఏంటి' అని కొందరు అడగగా, మరికొందరు ఐపీఎల్ చరిత్రలోనే అతిపెద్ద ట్రేడింగ్ డీల్ చూడనున్నామంటూ కామెంట్లు పెట్టారు. దీంతో అభిమానులు కన్ఫ్యూజన్‌కు గురవుతున్నారు. రోహిత్ కోల్?కతాకు వెళ్లడం ఖాయమేనని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ తాజా పోస్టుతో ఈ ప్రచారాలకు గురువారం తెరదించింది. 'రేపు మళ్లీ సూర్యుడు ఉదయిస్తాడు. అది మాత్రం పక్కా నిజం. కానీ రాత్రి ( వేళలో సూర్యుడు ఉదయించడం కష్టమే కాదు అసాధ్యం కూడా' రాసుకొచ్చింది. దీనికి బ్యాగ్రౌండ్‌లో ముంబయి లోగోతో ఉన్న రోహిత్ ఫొటోను షేర్ చేసింది. ఈ పోస్టులో కేకేఆర్‌కు సంబంధించిన నైట్ అనే ఇంగ్లీష్ పదాన్ని హైలైట్ చేసింది. దీంతో రోహిత్ కేకేఆర్‌కు వెళ్లనున్నాడన్న ప్రచారాన్ని పరోక్షంగా ముంబయి కొట్టిపారేసింది! ఇలా తాజా పోస్టుతో ఫ్యాన్స్ కన్ఫ్యూజన్‌కు ముంబయి ఫ్రాంచైజీ క్లారిటీ ఇచ్చింది. కాగా, ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో రోహిత్ శర్మ సక్సెస్‌ఫుల్ ప్లేయర్లలో ఒకరు. బ్యాటింగ్‌తోపాటు కెప్టెన్సీలోనూ తనదైన మార్క్ చూపిస్తూ తమ ఫ్రాంచైజీ ముంబయి ఇండియన్స్‌కు ఐదు టైటిళ్లు అందించాడు. 2013, 2015, 2017, 2019, 2020 సీజన్లలో ముంబయిని రోహిత్ ఛాంపియన్‌గా నిలిపాడు. 2011లో ముంబయితో చేరిన రోహిత్ 14ఏళ్లుగా అదే జట్టుతో కొనసాగుతున్నాడు. అయితే రెండేళ్ల కిందట రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి ఆ బాధ్యతలు హార్దిక్ పాండ్యకు అప్పగించింది. దీంతో గత రెండు సీజన్లలో రోహిత్ ప్లేయర్‌గానే కొనసాగుతున్నాడు. అప్పట్నుంచి రోహిత్‌కు ముంబయి మేనేజ్‌మెంట్‌కు మధ్య గ్యాప్ పెరిగిందని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది.

నేటి సాక్షి

TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలు..

8 కరీంనగర్ శుక్రవారం 31 అక్టోబర్ 2025





# రాజమౌళి-మహేశ్‌బాబు కాంబో

## కొత్త సినిమా విశేషాలు పంచుకోనున్న రాజమౌళి


రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందుతోంది. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాని 'ఎస్ఎస్ఎంబి 29' అని, గ్లోబ్ ట్రాట్టింగ్ మూవీ అని రకరకాలుగా పిలుస్తున్నారు. అయింతే ఈ సినిమాకి సంబంధించిన పూజా కార్యక్రమం చాలా సీక్రెట్‌గా జరిపించారు రాజమౌళి. హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్లో చాలా సీక్రెట్‌గా, పగడ్బందీగా ఓపెనింగ్ జరిపి, ఆ రోజు నుంచే కొన్నాళ్లపాటు షూటింగ్ కూడా జరిపారు. ఇటీవలే ఒక షెడ్యూల్ షూటింగ్ కోసం కెన్యా కూడా వెళ్లి వచ్చింది టీమ్. ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ వేదికగా ఈ సినిమాకి సంబంధించి ఒక పెద్ద ఈవెంట్ నిర్వహిస్తున్నారు రాజమౌళి. కే.ఎల్. నారాయణ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈవెంట్‌లో సినిమాకి సంబంధించిన అనేక విషయాలను వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా రాజమౌళి తన సినిమాలు మొదలుపెట్టేముందు ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, సినిమా ఎలా ఉంటుందో ముందే చెప్పేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఈవెంట్ నిర్వహించడానికి కారణం ఏంటి అనేది మాత్రం తెలియదు. నవంబర్ 15వ తేదీ జరగాల్సిన ఈవెంట్‌కు సంబంధించి ఇప్పటినుంచే ఏర్పాట్లు ప్రారంభమైనట్లుగా సమాచారం





# నేడు బాహుబలి ది ఎపిక్ విడుదల

## బాహుబలి-3పై ప్రేక్షకుల్లో ఉత్కంఠ




తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన 'బాహుబలి: ది బిగినింగ్' , 'బాహుబలి: ది కన్‌క్లూజన్ సినిమాలు ఇప్పుడు ఒకే వెర్షన్‌గా 'బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' టైటిల్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్స్ గురువారం రాత్రి నుంచే ప్రారంభం కానుండగా, అన్ని ఫార్మాట్లలో సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులుగా ' బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' చివర్లో బాహుబలి 3 పై ప్రకటన ఉంటుందంటూ ప్రచారం జోరుగా సాగింది. అయితే, నిర్మాత శోభు యార్లగడ్డ ఇప్పటికే ఈ రూమర్లపై క్లారిటీ ఇచ్చారు. బాహుబలి 3 ప్రాజెక్ట్ గురించి ఇంకా చాలా వర్క్ చేయాల్సి ఉందని, ప్రస్తుత ఎడిట్‌లో అలాంటి ఎలాంటి ప్రకటన లేదని ఆయన స్పష్టం చేశారు. బాహుబలి 3 ప్రస్తావన లేకపోయినా, ఓ సర్ప్రైజ్ మాత్రం ఉండవచ్చని శోభు ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అదేంటో తెలుసుకోవడానికి అందరూ ఎదురు చూస్తుండగా, ఇప్పుడు రాజమౌళి పరోక్షంగా దానిపై క్లారిటీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలైన రాజమౌళి, ప్రభాస్, రానా చిట్‌చాట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గంటకుపైగా నిడివి గల ఈ వీడియోలో సినిమా వెనుక జరిగిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్'లో అవంతిక లవ్ స్టోరీ, కొన్ని పాటలు, కొన్ని సన్నివేశాలు కటింగ్‌లో తొలగించాం. కథాంశాన్ని మరింత సూటిగా చూపించడానికే ఈ నిర్ణయం తీసుకున్నాం అని తెలిపారు. అలాగే, అందరూ బాహుబలి 3 వస్తుందని అనుకుంటున్నారని ప్రస్తావిస్తూ, అది కాదు అని స్పష్టంచేశారు. కానీ, ఒక స్పెషల్ సర్ప్రైజ్‌ను మాత్రం కన్ఫర్మ్ చేశారు. రాజమౌళి వెల్లడించిన ప్రకారం, బాహుబలి ఎపిక్ వెర్షన్ ఇంటర్వెల్‌లో 3డి యానిమేషన్ టీజర్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ టీజర్ ద్వారా బాహుబలి యూనివర్స్ కొనసాగనుందని చెప్పారు. ఈ యానిమేషన్ సీక్వెన్స్ దర్శకుడు ఇషాన్ శుక్లా రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.




## గ్లామర్ తో కట్టిపడేస్తున్న రకుల్..

రకుల్ ప్రీత్ సింగ్ తాజా ఇన్‌స్టాగ్రామ్ ఫోటోలతో అభిమానులను ఆకర్షించింది.. కుర్రకారు మతి పోగొట్టే స్టన్నింగ్ ఫోజులతో ఉన్న తాజా ఫోటోలు నెట్టింట షేర్ చేసింది. అజయ్ దేవగన్ తో కలిసి రకుల్ ప్రీత్ సింగ్ దేదే ప్యార్ దే -2 మూవీ కోసం రెడీ అవుతోంది..ఈ మధ్యనే ఈ మూవీ "జూమ్ షరాబీ"అనే పాటను మూవీ మేకర్స్ విడుదల చేశారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది.అయితే తాజాగా ఈ పాటను మరోసారి గుర్తు చేస్తూ రకుల్ ప్రీత్ సింగ్ తన సోషల్ మీడియా ఖాతాలో కొన్ని అద్భుతమైన ఫోటోలను పంచుకుంది. ఈ ఫోటోలలో తన స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ హాట్ ఫోటోలతో పాటు రకుల్ ప్రీత్ సింగ్ " ఆయేషా పూఛ్ రహి హై జూమ్ షరాబీ కైసా లగా?. చ%సవసవజూ-ఝతీసవ%2 అనే క్యాప్షన్ కూడా ఇచ్చింది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ షేర్ చేసిన ఫోటోలతో పాటు ఆమె పెట్టిన యాష్ ట్యాగ్ కూడా నెట్టింట్లో ట్రెండింగ్ లో ఉంది.రకుల్ ప్రీత్ సింగ్ ఈ పోస్ట్ పెట్టిన కొద్ది క్షణాలకే చాలా మంది ఆమె అభిమానులు హార్ట్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. ఓ నెటిజన్ ఏకంగా రకుల్ ప్రీత్ సింగ్ ఫోటోలకు నా హృదయ రాణి అని కామెంట్ పెట్టారు. ఆ ఫోటోల్లో రకుల్ ప్రీత్ సింగ్ ఉదయాన్నే బెడ్ మీద నుంచి లేచి ఎలా అయితే ఒళ్ళు విరుస్తారో అలాంటి హాట్ ఫోజులు పెట్టింది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ ఫొటోస్ నెట్టింట వైరల్ గా మారడంతో పాటు ఆమె పెట్టిన పోస్ట్ కు సంబంధించిన పాట కూడా ఇంటర్నెట్ లో ట్రెండింగ్ లో ఉంది.. ఇక రకుల్ ప్రీత్ సింగ్ సినీ పర్సనల్ కెరీర్ విషయాలకు వస్తే.. ఈ ముద్దుగుమ్మ తెలుగులో కెరటం అనే మూవీ తో వచ్చినప్పటికీ ఈ సినిమా అంత పేరు తెచ్చిపెట్టలేదు. కానీ ఆ తర్వాత సందీప్ కిషన్ తో చేసిన వెంకటాద్రి ఎక్స్ప్రెస్ మూవీ హిట్ కొట్టడంతో రకుల్ కి టాలీవుడ్ లో మంచి ఆఫర్స్ వచ్చాయి.అలా ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్, నాగార్జున, నాగ చైతన్య, మహేష్ బాబు వంటి స్టార్ హీరోలతో నటించింది.


# నా నటనకు రిటైర్మెంట్ లేదు

## మాస్ జాతర హీరో రవితేజ



'మాస్ జాతర' అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవని రవితేజ తెలిపారు. ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగిందన్నారు. జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం.

# మార్చి 19న లాక్ చేసిన టాక్సిస్



'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ నటుడు యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్ యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీన్ఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియార అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

# మహాకాళిగా కన్నడనటి భూమిశెట్టి

తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమి శెట్టి నటించనున్నట్లు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు. ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్లు సమాచారం . ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా (ం÷ఖబరజా। ఐరజీనినిజీ) శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ (ఖసజీబజీనిబిర ÷ఎజీసపజీ) మాట్లాడుతూ.. మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం అని అన్నారు. ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.





Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 966605221

# పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో సైకిల్ ర్యాలీ

- ఆరోగ్యానికి, సేవకు చిహ్నంగా ముందడుగు
- పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్...



**నేటి సాక్షి నారాయణపేట,అక్టోబర్ 30 :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.జిల్లా పోలీస్ పరేడ్ మైదానం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ సావర్కర్ చౌరస్తా, సత్యనారాయణ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగి, చివరగా ఎస్పీ కార్యాలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎస్పీ గారు, యువత, విద్యార్థులు, చిన్నారులు, పోలీసులు, ప్రజలతో కలిసి సైక్లింగ్ చేస్తూ, "జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్" అంటూ నినాదాలు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ... ప్రతి రోజు సైక్లింగ్ చేయడం వల్ల శరీర దృఢత్వం పెరగడమే కాకుండా మనసుకు ఉత్తేజం లభిస్తుంది అని ఆరోగ్యంగా ఉంటే విధుల్లో మరింత సమర్థతతో రాణించవచ్చు అని తెలిపారు. అమరవీరులను స్మరించుకుంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకునే దిశగా ఈ సైకిల్ ర్యాలీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినివ్వాలి అని ఎస్పీ గారు పేర్కొన్నారు.అమరవీరుల సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు, విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ ర్యాలీలో అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, సీఐ శివశంకర్, ఆర్ఐ నరసింహ, ఎస్సైలు వెంకటేశ్వర్లు, నరేష్, శివశంకర్, శ్వేత, శిరీష, కృష్ణ చైతన్య, రమణ, యోగ సభ్యులు, విద్యార్థులు, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా పౌర హక్కుల దినోత్సవం




- ప్రభుత్వ పరమైన ఫలాలు పొందడం మీ హక్కు
- తహసీల్దార్ ముప్పు కృష్ణ

**నేటి సాక్షి నల్లబెల్లి ప్రతినిధి అక్టోబర్ 30:** పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసిల్దార్ ముప్పు కృష్ణ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ చదువు లేక ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన లేక ఎన్నో ప్రభుత్వ పథకాలకు ఈ గిరిజన ప్రజలు దూరమవుతున్నారని, భారత రాజ్యాంగం నందు మీకొరకు పొందుపరచిన రిజర్వేషన్లు, ప్రత్యేకంగా కేటాయించిన పథకాలు పొందడం కూడా మీ హక్కుగా భావించాలని తెలియజేశారు. ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. మీ అవసరాలను అర్జీ రూపంలో తీసుకొని వచ్చిన ఎడల చట్టపరిధిలో మీకు న్యాయం చేయగలనని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శుభనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్క మనిషికి రాజ్యాంగపరంగా జీవించే హక్కు ఉందని ఇతరుల స్వేచ్ఛకు భంగం కలగనంత వరకు మీ స్వేచ్ఛను ఉపయోగించుకోవచ్చని తెలియజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం నందు పొందుపరిచిన ఫలాలను ఉపయోగించుకొని ప్రతి ఒక్క పేద విద్యార్థి అభివృద్ధి చెందాలని సూచించారు. వ్యవసాయ అధికారి బన్న రజిత మాట్లాడుతూ పిల్లలు తన తల్లి దగ్గర ఎలాగైతే మారాం చేసి తన కోర్కెలను తీర్చుకుంటారో అదే విధంగా పేద ప్రజలు ప్రభుత్వం దగ్గర తమకు వచ్చిన పథకాలను అడిగి తీసుకునే హక్కు ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ ముప్పు కృష్ణ,ఎంపీడీవో శుభనివాస్, వ్యవసాయ అధికారి బన్న రజిత, ఎం ఏ ఓ, ఏ ఎస్ఐ, మండలాధికారులు గ్రామ కార్యదర్శి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ను సీఎం ఎదుర్కొన్న తీరు అద్భుతం

- ముఖ్యమంత్రి చంద్రబాబు టాప్ అపార అనుభవం వల్లే ప్రాణ నష్టాన్ని నివారించగలిగాం
- చిత్తూరు పార్లమెంటు పరిధిలో ప్రజలకు బాసటగా నిలిచిన ప్రజాప్రతినిధులు, అధికారులకు అభినందనలు
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) చిత్తూరు :** ఆంధ్ర ప్రదేశ్ ను వణికించిన మొంథా తుఫాన్ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అపార అనుభవంతో ఎదుర్కొన్న తీరు మహా అద్భుతమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో కొనియాడారు. మొంథా తుఫాన్ బలహీన పడడంతో రాష్ట్రానికి ముప్పు తప్పిందని ఆయన అన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ముందస్తు చర్యలను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు.మా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు అపార అనుభవం, పాలనా దక్షత వల్లే మొంథా తుఫాన్ ప్రమాదం నుంచి ఆంధ్రప్రదేశ్ను కాపాడుకోగలిగామన్నారు. ఏపీ ప్రజల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకున్న చిత్తశుద్ధికి ఇదో తార్కాణమన్నారు. మొంథా తుఫాన్ బలహీన పడిన తర్వాత సీయం ఏరియల్ సర్వే నిర్వహించడం..తుఫాను వల్ల నష్టపోయిన ప్రజలను స్వయంగా పరామర్శించడంతోపాటు బాధితులకు ముఖ్యమంత్రి సహాయం అందించి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడం స్ఫూర్తిదాయకమన్నారు.తుఫాను వల్ల పునరావాస కేంద్రాలకు తరలివచ్చిన ప్రతి కుటుంబానికి రూ. 3,000 ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందనీ చెప్పారాయన. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి, మత్స్యకార కుటుంబాలకు 25 నుంచి 50 కిలోల బియ్యంతో పాటు, పప్పు, నూనె, ఉల్లిగడ్డలు, బంగాళాదుంపలు, చక్కెర వంటి నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారనీ.., ఆపదలో ఉన్న ఆప్తులకు ఆపన్న హస్తాన్ని అందించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మించిన సియంను తాను చూడలేదన్నారు.అదేవిధంగా తుఫాను కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారని తెలియజేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు..దాదాపు 87 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అంచనాలను అధికారుల ద్వారా తక్షణం సమాచారాన్ని సేకరించడం సీఎం పాలనా దక్షతకు నిదర్శనమని కొనియాడారు.తుఫాను తీరం దాటిన తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించడం కర్తవ్య నిర్వహణలో ఆయనకున్న చిత్తశుద్ధిని, సమయస్ఫూర్తిని తెలియజేసిందన్నారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో చిత్తూరు పార్లమెంటు పరిధిలో అప్రమత్తతో వ్యవహరించి, ప్రజలకు బాసటగా నిలిచిన ఎమ్మెల్యేలు, అధికారులను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఈ సందర్భంగా అభినందించారు.

# విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా - అపోలో ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ ఎక్స్పో



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల)చిత్తూరు, అక్టోబర్ 30:** ది అపోలో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన అపోలో ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ ఎక్స్పో %-% 2025 విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, సాంకేతిక ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమాన్ని యూనిర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పొతరాజు ప్రారంభించి, విద్యార్థుల ప్రాజెక్ట్ ప్రదర్శనలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ం "ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సాంకేతిక ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ది అపోలో యూనివర్సిటీ రీసర్చ్ మరియు ఇన్నోవేషన్‌లను మరింతగా ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశాం. త్వరలోనే ఇంక్యుబేషన్ సెంటర్ మరియు వర్క్‌స్టేషన్ ఏర్పాటు చేసి, విద్యార్థులను స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్ల దిశగా ప్రోత్సహించబోతున్నాం. అలాగే, విద్యార్థుల ప్రాజెక్టులను పేటెంట్ స్థాయికి తీసుకెళ్ళేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తున్నది," అని ప్రొఫెసర్ పొతరాజు పేర్కొన్నారు.ఎక్స్పోలో విద్యార్థుల ప్రాజెక్టులు సృజనాత్మకత, సాంకేతిక ప్రతిభకు నిదర్శనంగా నిలిచి, సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను సూచించాయి. స్టూడెంట్స్ ఇష్యూ ట్రాకింగ్ ప్లాట్‌ఫాం, స్మార్ట్ హౌస్, మైన్ సేఫ్టీ హెల్మెట్, స్మార్ట్ హైడ్రా ఐఓటి సిస్టమ్, ఇరిగేషన్ మరియు లైటింగ్ సిస్టమ్‌లు, వాయిస్ కంట్రోల్డ్ రోబో, ఎమర్జెన్సీ లేన్ సిస్టమ్, ఏఐ ఆధారిత హాజరు మేనేజ్‌మెంట్ వంటి సాంకేతిక ఆవిష్కరణలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ ప్రాజెక్టులు విద్యార్థుల సృజనాత్మకతను, సాంకేతిక దృష్టిని ప్రతిబింబించాయి.ఈ కార్యక్రమంలో ఏఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ డా. రమ్యా రామకృష్ణన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డా. డి. జగదీశన్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొ. కె. భాస్కర్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. సేతురామ సుబ్బయ్య, నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ జింటో మాథ్యూస్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డా. కె. తిరుమలేశు, డా. సి. పక్కిరయ్య, ఎన్. కీర్తి, ఎం. కమలహాసన్. అధిక సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

-రాజారాంపల్లి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు



**నేటిసాక్షి (కె గంగాధర్)పెగడపల్లి :** రాజారాంపల్లి గ్రామంలో గత 20 రోజుల నుండి పోసిన వరి ధాన్యం ఆకాల వర్షానికి తడిచి ముద్దయింది రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఐకెపీ సెంటర్ ను ప్రారంభించలేదు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకునే రేవంత్ రెడ్డి సర్కారు తక్షణమే ప్రజల పక్షాన ఉండి తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతు ప్రభుత్వం అని నిరూపించుకోవాలని మాట్లాడిన రాజారాంపల్లి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు. ఇట్టి కార్యక్రమంలో సాయిని రవీందర్,నాగుల రాజశేఖర్ గౌడ్,బండారి కనకయ్య, ఇస్లావత్ నరేష్ నాయక్, ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం

వేంపెంట గ్రామ ఎన్.సుందరాజు, కె.జయశేఖర్ ల పార్థివ దేహాలకు నివాళులు అర్పించి, వారికి సింగపూర్ తెలుగు సమాజం డాక్టర్,టేకూరి.నాగేశ్వరరావు.



**నేటి సాక్షి పాములపాడు అక్టోబర్ 30 :** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో తెలుగుదేశం కార్యకర్తలు నులక.సుందరాజు, మరియు కాటేపోగు.జయశేఖర్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని మాజీ సర్పంచ్ టేకూరి. రామసుబ్బమ్మ, పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు తరపున ఇరువురి కుటుంబాలకు 5000/- రూపాయల ప్రకారం ఆర్థిక సాయం అందించారు. ఇలాంటి సమయాల్లోనే ధైర్యంగా ఉండాలని, మీకు అన్ని విధాలుగా తోడుగా వుంటామని ఆయన కుటుంబానికి మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ భరోసా ఇచ్చారు. ఈ విషయం తెలుసుకొని సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్.టేకూరి.నాగేశ్వరావు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బోనపల్లె సత్యరాజు, ఎంపీటీసీ శివకుమార్, యువరాజు, ప్రసాద్, శ్రీధర్, చిన్నస్వామి ఆచారి, కుటుంబ రావు, రత్నాకర్, వార్డు మెంబర్ లక్ష్మన్న, వేమా రెడ్డి, సుబ్బారావు, గాండ్ల ప్రసాద్, బోనపల్లె వినయ్, జీవన్న, డీలర్ మధు, ప్రసన్న, జనసేన శేషు, ఆంథోనీ, విశ్వనాథం, సునీల్ ఎం.నాగరాజు, జనార్ధన్ నాయక్, ఎస్.నాగరాజు, శ్యామరాజు,సుంకన్న, ఎగ్గొని రాముడు, తాటిపాటి నాయుడు, దార కిరణ్,పక్కిరయ్య, శ్రీను, సుందరాజు, యోసేపు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# నీటి ప్రవాహాలను దాటొద్దు

గన్నేరువరం ఎస్సై జి. నరేందర్ రెడ్డి



**నేటి సాక్షి,గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్ ):** గన్నేరువరం మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గన్నేరువరం ఎస్సై జి నరేందర్ రెడ్డి సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాగులు వంతెనలపై వరద ప్రవాహాలను దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. రెండు రోజులపాటు తుఫాన్ ప్రభావం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. యువత సెల్ఫీల కోసం పరివాహక ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు నీటి మునిగిన రహదారులను నిలిపివేస్తూ హెచ్చరిక బోర్డులు భారీ కేడ్లు ఏర్పాటు చేసి పోలీస్ బందోబస్తు ఉంచమన్నారు. పిల్లలను ఇంటి నుంచి బయటకు రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100, మరియు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై జి. నరేందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..




## గరుడ వారధి పై వేగ నియంత్రణ చర్యలు చేపట్టండి

**స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య.**

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల)** తిరుపతి నగరంలోని గరుడవారధి పై వేగ నియంత్రణకు మరిన్ని అదనపు చర్యలు చేపట్టాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గరుడవారధి పై వాహనాల వేగ నియంత్రణ కొరకు స్మార్ట్ సిటీ, పోలీస్, ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ గరుడవారధి పై ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. వాహన చోదకుల్లో మరింత అవగాహన కలిగించేలా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా వేగాన్ని నియంత్రించే రబ్బర్ స్ట్రిప్స్, మలుపు తెలుపుతూ సూచిక బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు మరిన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే గరుడవారధి పైన, కింద ట్రాఫిక్ నియంత్రణ కొరకు చేయాల్సిన ఏర్పాట్లపై



చర్చించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రవిమనోహర్ ఆచారి, డి.ఎస్.పి. లు రామకృష్ణ ఆచారి, భక్తవత్సలం, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ. రవి, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



**ఎమ్మెల్యే.. గిత్త. జయసూర్య..**

**నేటి సాక్షి :పాములపాడు అక్టోబర్ 30 :** నంద్యాల జిల్లా పాములపాడు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఈడిగా నారాయణ గౌడ్ కొన్ని నెల క్రితం అనారోగ్య పరిస్థితి కారణంగా మరణించాడు. సీఎం సహాయ నిధి ఈడిగా నారాయణ గౌడ్ భార్య గీతా రాణి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. మండల పరిధిలోని సర్వసభ్య సమావేశంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ముఖ్యమంత్రి సహాయ నిధి' నుంచి రూ.49838 రూపాయలు మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మె ల్యే గిత్త జయసూర్య చెక్కును పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారాని అన్నారు. 'ఆరోగ్యమే మహాభాగ్యం'. ఆరోగ్యవంతమైన వ్యక్తులతోనే ఆనందమయ సమాజం, వాటితోనే అత్యుత్తమ అభివృద్ధి సాధ్యం. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే, ఉల్లాసంగా ఉత్సాహంగా జీవించగలం, కష్టపడగలం, జీవితాన్ని సాఫల్యం చేసుకోగాలమని కుటుంబంలో ఒకరు అనారోగ్యం పాలయితే, కుటుంబం మొత్తం కలత చెందుతుంది. మీ కుటుంబంలో వ్యక్తి అనారోగ్యానికి గురై మరణిం చడం నిజంగా బాధాకరం అని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య కు కృతజ్ఞతలు తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి గారు, క్లస్టర్ ఇంచార్జీ హరినాథ్ రెడ్డి , రుద్రవరం ఎంపీటీసీ శ్రీమతి అరుణ , తెలుగుదేశం పార్టీ నాయకులు సురేష్, మండల తెలుగుయువత అధ్యక్షుడు కరీంబాష, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు రవీంద్ర, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

- పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
- అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.
- పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్.



**నేటి సాక్షి వికారాబాద్:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని వికారాబాద్ జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ అన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, జిల్లా లో శాంతి యుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులను ఎస్ ఎఫ్ ఐ నాయకులను అక్రమ అరెస్టులు చేసిన పోలీసులు అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని , తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులకు దొంగ హామీలు ఇచ్చి గద్దినెక్కారు అన్నారు కదా ఆరు సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో 8150 కోట్ల దాకా స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్లో ఉందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో చదివి విద్యార్థులకు సర్టిఫికెట్స్ తీసుకుందాము అంటే ప్రభుత్వం నుండి డబ్బులు రాలేదని విద్యా సంస్థల యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు గత నెల రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు పీజీ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రంలో బందుకు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి 1200 కోట్ల రూపాయలను రెండు దఫాలుగా దసరా దీపావళి కి విడుదల చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా మోసం చేసింది అన్నారు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు రాష్ట్రం లో విద్యాశాఖ మంత్రి స్వయంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఉన్న విద్య రంగం పై ఒక్క సారి సమీక్ష లేకుండా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని కాబట్టి రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగా సమస్యలపై అలాగే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు లేకుంటే ఎస్ ఎఫ్ ఐ గా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ జిల్లా నాయకులు రాకేష్ , సిద్దు ,రెహాన్, జునేద్ అఖిల్ , శిర్యాజ్, రాజు ,ఇస్మాయిల్ దీపక్ ,చందు తదితరులు పాల్గొన్నారు.

## నేల వాలిన వరిచేలు...ఆందోళనలో రైతులు

- ఫసల్ బీమా యోజన పథకం అమలు చేయాలి
- పంట పొలాలను పరిశీలించిన బిజెపి బృందం
- జెపి మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్



**నేటి సాక్షి పాలేరు , అక్టోబర్ 30:** పంట చేతికి వచ్చే సమయంలో మొంథా తుఫాన్ ప్రభావంతో తుఫాను దాటికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్ డిమాండ్ చేశారు గురువారం మండల పరిధిలోని కాకరవాయి గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలను బిజెపి బృందం పరిశీలించి ఈ సందర్భంగా బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్ మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో వందలాది ఎకరాలు వరి పంట పాలు పోసి దశలో రాగానే తుపాన్ ప్రభావంతో వరి పంటలు నేల వాలినాయని గత బిఆర్ఎస్ ప్రభుత్వం నేడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పసల్ బీమా యోజన పథకం అమలు చేయకపోవడం చాలా విచారకరమని అదే పసల్ బీమా యోజన పథకం అమలు చేస్తే ప్రతి రైతుకు ఎకరాకు 30 నుండి 40 వేల రూపాయల అసలు భీమా యోజన పథకం వర్తించదని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పసల్ బీమా యోజన పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. మొంథా తుఫాన్ ప్రభావంతో మండలం లోని పలు గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అనేక ఎకరాల్లో వరి నేల వాలగా, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటి వరకు ఆశించినంత దిగుబడి రాకపోగా కొద్దోగొప్పో చేతికి అంగుతుందని అనుకునే సమయంలో తుఫాను దాటికి పత్తి చేలు పెద్ద మొత్తంలో దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ప్రతి ఎకరాకు నష్టం పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని బిజెపి బృందం డిమాండ్ చేసింది.. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్ నల్లగట్టు రాములు, కొమ్ము వెంకన్న ఊడుగుల వీరయ్య, నల్లగట్టు నవీన్, నల్లగట్టు వేణు ,వెంకటయ్య, దుర్గయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు..

## మొథా తుపాన్ దాటికి ధ్వంసం అయిన వరి పంట



**నేటి సాక్షి,గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్ ) :** గన్నేరువరం మండలంలోని చాకలి వానపల్లి గ్రామంలోని కూనవాని పల్లె లో యువ రైతు కూన చంద్రశేఖర్ వరి పంట మొథా తుపాన్ దాటికి పూర్తిగా నేల రాలింది. రైతు మాట్లాడుతూ పొట్ట దశకు వచ్చిన వరి పంట కూడా నేలకొరిగి రైతులకు తీవ్ర విషాదం మిగిల్చింది పంటలు చేతికందే దశలో వర్షాలు తుఫాన్లు రైతులకు విషాదాన్ని మిగిల్చాయి అంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 35 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని యువ రైతు కూన చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు.

## గన్నేరువరం పెద్ద చెరువు మత్తడిలో కొట్టుకుపోయిన ద్విచక్ర వాహనం

**- కాపాడిన గన్నేరువరం పోలీసులు**




**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్) :** గన్నేరువరం మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద గురువారం వర్షానికి నీటి ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. చెరువు వద్ద చేపల కోసం కాపల ఉన్న బీహార్ రాష్ట్రానికి చెందిన రాజీవ్, లాల్ కు బచ్చన్ వీరి స్వంత పనుల కోసం గుండ్లపల్లి నుండి కరీంనగర్ కు వెళ్లి వెంకటరావుపల్లి మీదుగా ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా చొక్కారవుపల్లి, గన్నేరువరం పెద్ద చెరువు వద్ద అదుపుతప్పి వరద నీటిలో కొట్టుకుపోయారు.. వెంటనే గన్నేరువరం పోలీసులు పెద్ద చెరువు వద్ద పరివేక్షణలో భాగంగా కొట్టుకుపోయిన వ్యక్తిని తాడు సహాయంతో కాపాడారు.. ద్విచక్ర వాహనం నీటిలో మునిగిపోయింది. కొట్టుకపోయిన ఇద్దరు వ్యక్తులను కాపాడిన గన్నేరువరం పోలీసులను పలువురు అభినందించారు.

## ధన్వాడ గ్రామపంచాయతీ వాటర్ మ్యాన్ అనారోగ్యంతో మృతి



**నేటి సాక్షి,నారాయణపేట అక్టోబర్ 31 :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో వాటర్ మేనంగా పనిచేస్తున్న టాకీ నరసింహ (35)అనే వ్యక్తి పనిచేస్తూ అనారోగ్యంతో గురువారం ధన్వాడ మండల కేంద్రంలో మృతి చెందడం జరిగింది. మృతి పట్ల ఐ టి యూ సి జిల్లా నాయకులు పి వెంకటేష్ సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన నర్సింహ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మృతి చెందిన నర్సింహ కుటుంబంలోని ఒకరికి గ్రామపంచాయతీలో ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## మాగంటి సునీత గోపీనాథ్ గెలుపు ఖాయం:

**రాష్ట నాయకుడు శివ ప్రకాష్**



**నేటి సాక్షి శంకర్పల్లి: అక్టోబర్ 30:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ఘన విజయం సాధిస్తుందని రాష్ట్ర నాయకుడు శివ ప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం మాగంటి సునీత కార్యాలయంలో ఆమెకు శివ ప్రకాష్ బొకే ఇచ్చి, మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శివప్రకాష్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఓటర్లు బిఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని, భారీ మెజార్టీతో మాగంటి సునీత గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాగంటి వాత్సల్యనాథ్, కళ్యాణ్, శరత్, రాజు, చిరంజీవి, కృష్ణ, సాయి ఉన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం
29 అక్టోబర్ 2025


# అకాల వర్షంతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

- పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్
- నష్టపోయిన పంట వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఆదేశాలు

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** మొంథా తుఫాన్ దాటికి నియోజకవర్గ వ్యాప్తంగా నష్టపోయిన పంటపొలాలను రైతులతో కలసి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి గురువారం రైతులతో కలిసి పంటపొలాలలో తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టం జరిగిన రైతులను ఓదార్చి, వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసి, వెంటనే పడిపోయిన పంటపొలాలను సందర్శించి, జరిగిన నష్టాన్ని పరిశీలించి, నివేదిక సిద్ధం చేయాలని, వారికి నష్ట పరిహారం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి రైతును ఆదుకుంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంఆగ్రెస్ పార్టీ నాయకులు మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



# అన్ని బస్తీలకు రవాణా సౌకర్యం కల్పిస్తాం



- మామిడిపల్లి గ్రామానికి త్వరలోనే ఆర్టీసీ బస్సులు
- ఉచిత బస్సు ప్రయాణంతో డబ్బులు ఆదా: మహిళలు, విద్యార్థులు

**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 30 :** మామిడిపల్లికి బస్సు సౌకర్యం కల్పించి ఆడపడుచులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బడంగ్ పేట కార్పొరేషన్ లో అతిపెద్ద గ్రామం మామిడిపల్లి. ప్రజలు నిత్యం పట్టణప్రాంతాలకు వెళ్లేందుకు సొంత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. మహిళలు, విద్యార్థులు చిరు ఉద్యోగులు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి టెంపుల్ ఛైర్మన్ నరేష్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్ విజయ్ గౌడ్, లాల్ సతీష్, జంగయ్య బృందం కేఎల్ఆర్ కు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగించి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను లక్ష్మారెడ్డి కోరారు. త్వరలోనే బస్సులు మామిడిపల్లికి వచ్చి ఆడపడుచులు, విద్యార్థులు, ఉద్యోగులకు కలుగుతున్న ఇబ్బందులు తొలుగుతాయని కిచ్చెన్న అన్నారు. ఇటీవలే ఆర్కేపురం డివిజన్ లో పలు కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించటంతో ఉచితంగా ప్రయాణిస్తున్నామని కేఎల్ఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిచ్చెన్నగారు మాట్లాడుతూ... బస్సు లేని ఊరు, కాలనీ లేకుండా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదిళ్ల నరేందర్, రాజ్ కుమార్, చీమలదారి చెన్నయ్య సహా పలువురు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ముంథా తుఫాన్ మరియు అకాల వర్షాల వలన పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలనిసిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ పరిధిలోని మాడుగులపల్లి మండలంలోని పలు గ్రామాలలో గురువారం రైతులతో కలిసి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, క్షేత్ర స్థాయిలో పర్యటించి, నష్టపోయిన పంటను అంచనా వేసి, ఎకరానికి రూ. 30వేల నష్టపరిహారం వెంటనే ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దేవి రెడ్డి అశోక్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, సిపిఎం మండల కమిటీ సభ్యులు జూకూరు నాగయ్య, పతాను శ్రీను, సిపిఎం కుక్కడం శాఖ కార్యదర్శి మునగాల నారాయణరెడ్డి, శాఖ సభ్యులు పండగ నాగయ్య, సీతారాం రెడ్డి రైతులు అలుగుబెల్లి గోవర్ధన్ రెడ్డి, షేక్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



# వైభవోపేతం..శ్రీ కల్యాణ వెంకన్న పుష్పయాగం..!



- వివిధ రకాల పుష్ప, పత్రాలతో స్వామికి నివేదన
- ఊరేగింపుగా తీసుకువచ్చిన చెవిరెడ్డి కుటుంబీకులు
- శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లకు జరిగిన పుష్పయాగం

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** పరమ పవిత్రమైన కార్తీక మాసంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం పుష్ప యాగ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. పరిమళ భరిత సువాసనలు వెదజల్లే 14 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. రంగు రంగుల పుష్పాలు, పత్రాల మధ్యన కొలువుదీరిన స్వామి, అమ్మవార్ల వైభవం భక్తులకు కనువిందు చేసింది. గత నెలలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో అర్చకులు, ఉద్యోగులు, భక్తుల వల్ల తెలియక జరిగిన తప్పులు, దోషాల నివారణకై ఆలయంలో పుష్ప యాగం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారికి పుష్ప యాగ మహోత్సవంను కన్నుల పండువుగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను పట్టు వస్త్ర స్వర్ణాభరణాలతో అందంగా అలంకరించి వేద మంత్రాల నడుమ పుష్ప కైంకర్యం చేశారు. చామంతి, వృక్షి, సంపంగి, సెంటు జాజులు, పొగడ, రోజా, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, కలువ, మొగలి రేకులు వంటి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదిరిపచ్చ తదితర పత్రాలతో స్వామి, అమ్మవార్లను అర్చించారు. ఈ సందర్భంగా వేదపండితులు రుగ్వేదం, శుక్లయజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలను పఠించి స్వామి, అమ్మవార్లకు సాంత్వన కలిగింప చేశారు. ఆలయ అర్చక స్వాములు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో 20 సార్లు స్వామి, అమ్మవార్లను అర్చించారు. ఉత్సవమూర్తులకు నిండుగా పుష్ప, పత్రాలతో ముంచెత్తి నివేదన చేపట్టారు. ఆ తరువాత ఆలయ మాడ వీధులలో ఊరేగింపుగా బయలుదేరిన స్వామి, అమ్మవార్లు భక్తులను అనుగ్రహించారు. ఈ పుష్పయాగంకు దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రక, రకాల పుష్పాలు, పత్రాలను తీసుకు వచ్చి యాగానికి వినియోగించారు. కల్యాణ వెంకన్న పుష్పయాగ మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



### ఊరేగింపుగా తీసుకువచ్చిన చెవిరెడ్డి కుటుంబీకులు

శ్రీ కల్యాణ వెంకన్న ఆలయంలో జరిగే పుష్ప యాగానికి వినియోగించే వివిధ రకాల పుష్ప, పత్రాలను ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు గ్రామ-స్తులతో కలసి ఊరేగింపుగా తీసుకువచ్చారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డిలక్ష్మీ, సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మంజుల దంపతులతో పాటు గ్రామపెద్దలు, ఆలయ అధికారులు, సిబ్బంది పుష్పాలు, పత్రాలను గ్రామంలో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి స్వామి, అమ్మ వార్లకు నివేదించారు.

# పూర్వపు విద్యార్థులచే పాఠశాలకు రేకుల షెడ్డు ఏర్పాటు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** మండలంలోని కాగతి పంచాయతీ మర్రిమాకులపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి 2003/04 పూర్వపు విద్యార్థులు రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు ఈ క్రమంలో గురువారం ప్రారంభించారు ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలకు రూ లక్షల విలువ చేయు షెడ్డును ఏర్పాటు చేశారు ఎంఈఓ లు కేశవరెడ్డి తిరుమలమ్మలు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ సి ఆర్ సి ప్రధానోపాధ్యాయుడు నాదముని నాయుడు ఉపాధ్యాయులు 2003/04 పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కుండే కుమార్

**బిజెపి పార్టీ రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుండే కుమార్**



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 30:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గము పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన.. బూర్గుల రామయ్య కుమారుడు కళ్యాణమాస వేడుకలో.. పాల్గొన్న రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుండే కుమార్ నూతన వధూవరులను ఆశీర్వదించి.. కుమార్ మాట్లాడుతూ.. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో.. దాంపత్య జీవితం ఆనందంగా కొనసాగాలని పెళ్లి అంటే ఒకరిగా ఉండి ఇద్దరిగా మొదలుకొని పిల్లాపాపలతో.. నిండు నూరేళ్లు వర్ధిల్లాలని నూతన వధువు వరులను ఆశీర్వదించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో.. బూర్గుల రామయ్య కుటుంబ సభ్యులతో పాటు.. కుమార్ యొక్క అభిమానులు.. పాల్గొనడం జరిగింది

# రాయబారపు కొండమ్మకు నివాళు లర్పించిన విలేకరులు..



**నేటి సాక్షి పాలేరు , అక్టోబర్ 30 :** కూసుమంచి మండలం జక్కేపల్లి ఎస్సీ కాలనీ ప్రజాకలం రిపోర్టర్ రాయబారపు రమేష్ తల్లి కొండమ్మ దశదిన కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు విలేకరులు పాల్గొని కొండమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.. నివాళులర్పించిన వారిలో కొమ్ము ప్రభాకర్ రావు , కొండ శ్రీనివాసరావు , మట్టే దేవేందర్ , గోవింద వెంకట్ , మేడవరపు బ్రహ్మం ,జిల్లపల్లి వెంకట్ ,ఇరుగు శ్రీను , కొమ్ము ప్రసాద్ , పోలిపోంగు నాగరాజు , నవీలే బాబు ఉన్నారు.

# బిఆర్ఎస్ గెలుపుతో కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు కావాలి

- మన బ్రతుకులకు భరోసానిచ్చిన "కారు గుర్తు"కు ఓటువేయాలి
- బోరబండ డివిజన్ ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ అక్టోబర్ 30 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను పురస్కరించుకొని 103 – బోరబండ డివిజన్ బాబా సైలానీ నగర్ లో బోరబండ డివిజన్ ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ , మాగంటి సునీత గోపీనాథ్ మద్దతుగా వారి కుమార్తెలు దీక్షిత, అక్షిత లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పేద ప్రజల బ్రతుకులకు భరోసానిచ్చిన పార్టీ బిఆర్ఎస్ అయితే, అబద్ధపు హామీలతో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక ప్రజలకు మొండి "చెయ్యి" చూపిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కాబట్టి నవంబర్ 11న జరిగే ఎన్నికల్లో మన బ్రతుకులకు భరోసా



నిచ్చిన బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ 3వ నెంబర్ పై ఓటు వేసి మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన గన్నేరువరం ప్రెస్ క్లబ్

ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మాదరి శ్రీనివాస్



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్) :** గన్నేరువరం మండల కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు నక్క అంజయ్య సుధ కూతురు శ్వేత సాయి ప్రణీత్ వివాహానికి గన్నేరువరం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మాదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో బుర్ర కోటేశ్ గౌడ్, బుర్ర రాజ్ కోటి గౌడ్, నక్క దామోదర్ పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ

సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు



**నేటి సాక్షి కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి అక్టోబర్ 30 :**భీమిని. మండలం చిన్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సోమిశెట్టి రాజయ్య మరియు కన్నెపల్లి మండలం మాడవెల్లి గ్రామానికి చెందిన దాసరి రాజు ప్రైవేటు ఆసుపత్రిల్లో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నర్సింగ్ రావు, రామన్న, తిరుపతి, మల్లేష్, గంగారాం, భూమన్న, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ఉమా కి బీజేపీ నాయకుల అభినందనలు.



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 30:** కేశంపేట్ మండల పరిధిలోని పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఉమాకి అభినందనలు తెలియజేసిన బిజెపి మండల నాయకులు. రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ యువ నాయకులు కర్రెడ్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కొంతకాలంగా పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూన్నా ఉమా గారు ఇప్పుడు గ్రూప్ 2కి ఎంపికైన సందర్భంగా అభినందనలు తెలియడం జరిగింది. ఒకవైపు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరోవైపు ఫ్యామిలీని చూసుకుంటూ. గ్రూప్ 2 కి ఎంపికై సెక్రెటరీయేట్ లో బాధ్యతలు నిర్వహించబోతున్న మీకు అభినందనలు మరిన్ని ఉన్నతమైన పదవులకు ఎదగాలని కోరుకుంటున్నాం. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్, మండల ప్రధాన కార్యదర్శి కల్వకుల్ తిరుపతి, పిప్పళ్ళ నరేందర్ మరియు బిజెపి నాయకులు పాల్గొనడం జరిగిందిం

## సీజే గవాయిపై దాడిం మా ఆత్మగౌరవంపై దాడే!

**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 30:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై దాడి దళితుల ఆత్మగౌరవంపై దాడిగా ఎంఎస్పి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రావుగల బాబు మాదిగ వ్యాఖ్యానించారు. మహేశ్వరం కేంద్రంలో జరిగిన ఎంఎస్పి కీలక కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ:–ఆత్మగౌరవం జోలికొస్తే ఎవరినీ సహించేది లేదు. సీజే గవాయి పై దాడి చేయడమంటే రాజ్యాంగ స్ఫూర్తిపై దాడి చేయడమే అని అన్నారు. 20 రోజులు గడిచినా దాడి చేసిన



లాయర్ రాకేష్ కిషోర్‌పై ఇప్పటికీ కేసు, అరెస్టులు జరగకపోవడం నిరసనీయమని ఆయన పేర్కొన్నారు. ఉన్నత కులానికి చెందిన జడ్జిపై ఇలాంటిదై ఉంటే,ఇప్పటికి దేశమంతా రగిలిపోయేది అని ఆయన ప్రశ్నించారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు,రాజ్యాంగాన్ని గౌరవించేందుకు నవంబర్ 1న హైదరాబాద్ ఎల్బీ స్టేడియం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుండి సెక్రటేరియట్ పక్కన ఉన్న పెద్ద అంబేద్కర్ విగ్రహం వరకు దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ ర్యాలీలో కుల, మత,పార్టీ తేడా లేకుండా రాజ్యాంగ విలువలను నమ్మే ప్రతీ ఒక్కరూ పాల్గొని దళితుల ఆత్మగౌరవానికి మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



- ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నాయకులతో కలిసి పంపిణీ చేసిన ఎమ్మెల్యే గిత్త.జయసూర్య

**నేటి సాక్షి :పాములపాడు అక్టోబర్ 30 :** పాములపాడు మండలంలోని, వేంపెంట, మద్దూరు, భానుముక్కల, కృష్ణరావుపేట, ఎర్రగూడూరు గ్రామాలకు చెందిన లోకేశ్వర్ రెడ్డి కి 48,000/-రూపాయలు, ఇడిగ.నారాయణ గౌడ్ కి 49,838/- రూపాయలు, శ్రీనివాస్ రెడ్డి కి 22,163/- రూపాయలు, గుడిబండ.శంకర్ కి 63,961/- రూపాయలు, వెంకట లక్ష్మమ్మ భాయి కి 25,768 /-రూపాయలు, శ్రీనివాసులు కి 410,48/- రూపాయలు, శంసుంగ్ బి కి 85,695/- రూపాయలు, జిగిరి లక్ష్మీదేవి కి 1,67,974/- రూపాయలు, కె.కుమార్ కి 91,571/- రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను నందికొట్కూరు నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త.జయ-సూర్య మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, వేంపెంట గ్రామ సర్పంచ్-వై.మాణిక్యమ్మ, వేంపెంట సొసైటీ చైర్మన్-లక్ష్మీకాంతరెడ్డి, టిడిపి బిసి సెల్ అధ్యక్షుడు-కంభం.మోహన్ గౌడు, మిట్టకందాల గ్రామ మాజీ సర్పంచ్- జి.హరిప్రసాద్ యాదవ్, వేంపెంట నాయకులు ఆదిరెడ్డి, బాలస్వామి, వై.దానమయ్య తదితర నాయకులతో కలిసి బాధితులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో- ఎన్. చంద్రశేఖర్, టిడిపి మండల నాయకులు ఎర్రగూడూరు హరినాథ రెడ్డి, పాములపాడు భూమా రాములమ్మ, ఎమ్మెల్యే గవర్నమెంట్ పి - రవీంద్ర, తదితర నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయునికి ఘన సన్మానం

**నేటి సాక్షి పాలేరు , అక్టోబర్ 30 :** కూసుమంచి మండలం జక్కేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సుమారుగా ఏడు సంవత్సరాలు పని చేసి స్కూల్ అసిస్టెంట్ గా ప్రమోషన్ పొంది ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్తున్న తేజావత్ రాంకోటి నీ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గురువారం జక్కేపల్లి పాఠశాలకు ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాంకోటి 15 మంది ఉన్న విద్యార్థులను బడిబాట కార్యక్రమంలో కష్టపడి 45 మంది విద్యారుల సంఖ్యను పెంచారని, విద్యార్థులకు చక్కటి బోధనను అందించారని, వారి యొక్క సేవలను కొనియాడారు. టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు మాట్లాడుతూ.. రాంకోటి ఉపాధ్యాయ వృత్తిలోనే కాకుండా ఉపాధ్యాయ సంఘంలో కూడా ఎంతో కష్టపడి మంచి గుర్తింపు తెచుకున్నారని ఆయనకు ప్రమోషన్ రావడం పట్ల శుభాకాంక్షలు తెలియజేశారు. రెండు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాల్గొని



ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పదవ తరగతి, 4,5 వ తరగతుల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను, ఒకటి నుంచి మూడో తరగతి విద్యార్థులకు పలకలను రాంకోటి బహుకరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మాబాయి, ఉపాధ్యాయిని రమాదేవి, టిపిటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి భద్రు,అధ్యక్షుడు యకయ్య, హై స్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు రవికుమార్, ఉపేంద్ర, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ, కృష్ణలత,జానిమియ, జ్యోతి పాల్గొన్నారు..

# రైతుల ధర్నాకు.మద్దతు ప్రకటించిన బి.ఆర్.ఎస్.పార్టీ



- పంట నష్టపోయి రైతుల ధర్నాకు.మద్దతు ప్రకటించిన బి.ఆర్.ఎస్.పార్టీ

**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి అక్టోబర్ 30 :** కాగజ్ నగర్ మండలంలోని కోసిని,రేగుల గూడ,కూసుగుడా,దరిగాం వేంపల్లి ఇతర గ్రామాల రైతులు తమ పత్తి పంటను అడవి పందులు మొత్తం తిని నష్టం చేస్తున్నాయని తమకు నష్టపరిహారం చెల్లించాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, కాగజ్ నగర్ నందు ధర్నాకు దిగడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని రైతుల పక్షాన శ్యామ్ రావ్ . మాట్లాడుతూ కాగజ్ నగర్ మండలంలోని. చుట్టు పక్కల గ్రామాలలో సన్న కారు చిన్నకారు రైతులు మాత్రమే ఉన్నారని ఒక్కొక్క రైతుకు ఒకటి రెండు మూడు నాలుగు ఎకరాలు వరకే భూమి ఉందని,అందులో వేసిన పంటతోటే వారు జీవించాలని ఈ భూమి మాత్రమే వీరికి జీవనాధారం అని ఈ భూమిపై ఆధారపడి జీవిస్తున్నారని అటువంటిది అడవి పందులు రైతుల చేనులో వచ్చి చేతికిచ్చిన పంటను నాశనం చేస్తున్నాయని గత వారం రోజుల నుండి వందల ఎకరాలలో వేల సంఖ్యలో పందులు చొరబడి పంట నష్టం చేశాయని, అసలే రైతులు వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు పంట మొత్తం నేల పాలు కాగా మిగిలిన పంటలు కూడా పందులు నాశనం చేశాయని వీరికి వెంటనే ప్రభుత్వం స్పందించి ఆటవి అధికారులు నష్టపోయిన వారి పంట సర్వే చేయించి తగిననష్టపరిహారం ఇవ్వాలని ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వారంలో అధికారులకు తెలియజేసిన పందుల గురించి పట్టించుకోవడం లేదని మీరు రైతులను పట్టించుకోకుంటే రైతులు మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ ప్రాంతంలో వీరి ఓట్లతో సీట్లు ఎక్కిన నాయకులు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ. ఇప్పటివరకు రైతులను పట్టించుకోవడం లేదని రైతుల ఓట్ల మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదని వెంటనే ఆటవీ అధికారులు పంట నష్టాన్ని సర్వే చేయించి రైతులకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతుల పంటను పందుల బారి నుండి రక్షించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ డి ఓ. రైతుల ధర్నా ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరగా FDO సుశాంత్. స్పందించి రైతుల ముందుకు వచ్చి రెండు రోజులలో ఆటవి బృందాలను పంపి రైతుల పంట నష్టాన్ని సర్వే చేయించి నష్టపరిహారం ఇవ్వడానికి హామీ ఇచ్చారు. అదేవిధంగా రైతుల చేనులలో అడవి పందులు చొరబడకుండా ఉండడానికి సోలార్ ఫెన్సింగ్ పెట్టుకోవడానికి అనుమతిని ఇచ్చారు. మరియు రైతుల పంటలను అడవి పందుల నుండి రక్షించడానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనితో రైతులు ధర్నాను విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 10గ్రామాలలో రైతులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం
29 అక్టోబర్ 2025



# అన్ని వైద్య సేవలు ఉచితంగా చేయాలి




- డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా చేయాలి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి: డాక్టర్. వెంకటరమణ.
- డిడిసి కమిటీ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

**నేటి సాక్షి నంద్యాల, అక్టోబర్ :** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ జిల్లాలో ఉన్న అన్ని నెట్వర్క్ ఆసుపత్రులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చాంబర్ నందు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ స్కీం గురించి వైద్యాధికారులతో డిడిసి(జిల్లా డిసిప్లైనరీ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటరమణ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వైద్య అభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేయడం జరుగుతుందని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా చేయాలన్నారు. ఇకనుంచి ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగుల నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయరాదని అన్ని వైద్య సేవలు ఉచితంగా చేయాలన్నారు. అలా చేయని యెడల పదింతల వరకు అపరాధ రుసు విధించడం తోపాటు ఆసుపత్రి లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఏ ఆసుపత్రులు అయితే గ్రీవెన్స్ ఉన్నాయో ఆ ఆసుపత్రులకు అపరాధ రుసుం విధించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా కన్సల్టేషన్ చార్జీలు, ఇన్వెస్టిగేషన్ కు, ఎమర్జెన్సీ సేవలు పూర్తి ఉచితంగా అందించాలన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ కింద పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించేటట్లు చూడాలని డిఎంహెచ్వోను కోరారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఓ. లలిత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వై. రూపేంద్ర నాథ్ రెడ్డి, జిల్లా మేనేజర్ ఆర్ శ్రీధర్ గ్రీవెన్స్ ఉన్న నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి

- రైతుల ధాన్యం రవాణాకు ఇబ్బంది కలగకుండా రోడ్లు మరమ్మతులు చేపట్టండి
- పంట నష్టం అంచనాకు అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా పనిచేయాలి
- అన్ని శాఖలతో వాట్సప్ గ్రూపు
- సమావేశంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** తుఫాన్ ఎఫెక్ట్ నివారణ కోసం అన్ని శాఖల అందరూ సమన్వయంతో పనిచేయాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, డిఎస్పీ రాజశేఖర్ రాజు తో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ, మొంధా తుఫాన్ దాటికి దెబ్బతిన్న రోడ్లను ఆర్ అండ్ బి శాఖ అధికారులు గుర్తించి, రైతులు ధాన్యం రవాణాకు ఇబ్బంది కలగకుండా, గ్రామాల నుంచి వచ్చే రోడ్లలో గుంతలను గుర్తించి తక్షణమే మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు పంట చేతికి అంది వచ్చేవేళ తుఫాను రైతన్న తీవ్ర నిరాశకు ఇబ్బందులకు గురిచేసిందని, రైతులకు అధికారులంతా అండగా నిలవాలని, పంట నష్టం అంచనావేసేందుకు వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా, ప్రతీ గ్రామానికి వెళ్లి, పంటపొలాలను పరీక్షించి, సర్వే నిర్వహించి, నివేదికలు అందజేయాలన్నారు. విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారులు, గాలికి తెగిపోయిన కరెంట్ లైన్స్, పోల్స్ అన్నిటిని గుర్తించి వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, మిల్లర్లు పెద్ద మనసుతో రైతు సంక్షేమం కోసం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్స్ ను కోరారు. మిల్లుల వద్ద రైతుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షించాలని, విద్యా శాఖ అధికారులు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేయాలని, గ్రామస్థాయిలో ఏ సమస్యలున్న గుర్తించి, సంబంధిత అధికారులకు తెలియచెప్పే బాధ్యతను ఉపాధ్యాయులు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయడం జరుగుతుందని, అందులో అధికారులు గుర్తించిన సమస్యలను, చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని కోరారు. అకాల ఆపద సమయాన్ని ఎదుర్కొనేందుకు అధికారులు పరస్పర సహకారంతో సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ శాఖ, పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ, మున్సిపాలిటీ, ఆర్ అండ్ బి, ఎంపీడీఓ లు, పంచాయతీ రాజ్ శాఖ, విద్యుత్ శాఖ, విద్యాశాఖ అధికారులు, నీటిపారుదల శాఖ, మిల్లర్స్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత పటేల్ ను ఆదర్శంగా తీసుకోవాలి




## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) తిరుపతి :** మాజీ ప్రధానమంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. స్వాతంత్ర పోరాటంలోనే కాకుండా స్వాతంత్ర అనంతరం దేశంలో సంస్థానాల విలీనంలో సర్ధార్ వల్లబాయ్ పటేల్ ఎంతో కీలకంగా వ్యవహరించారని ఆయన గుర్తు చేశారు. మాజీ ప్రధానమంత్రి సర్ధార్ వల్లబాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా నగరంలోని మహాత్మ జ్యోతిరావ్ పూలే విగ్రహం నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు యూనిటీ మార్చ్ ను మై భారత్ చిత్తూరు, తిరుపతి జిల్లా శాఖలు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉక్కు మనిషిగా పేరుపొందిన వల్లబాయ్ పటేల్ దేశ సమైక్యత కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తని చెప్పారు. స్వాతంత్ర అనంతరం దేశంలో కలిసేందుకు కొన్ని సంస్థానాధీశులు ముఖ్యంగా జూనాఘడ్, హైదరాబాద్ లు అంగీకరించ లేదని ఆయన తెలిపారు. అయితే వల్లబాయ్ పటేల్ కేంద్ర హెూం శాఖ మంత్రిగా హైదరాబాద్, జూనాఘడ్ సంస్థానాలపై సైనిక చర్యతో దేశంలో విలీనం చేశారని ఆయన చెప్పారు. యువత తమ లక్ష్య సాధనకు ఎంత పట్టుదలతో కృషి చేస్తారో అదే రీతిలో దేశం కోసం పని చేయాల్సిన అవరం ఉందని ఆయన తెలిపారు. దేశ ఐక్యత, రక్షణ కోసం వల్లబాయ్ పటేల్ తరహాలో ప్రధానమంత్రి నరేంద్ర మోది ఆపరేషన్ సింధూర్ నిర్వహించి ప్రపంచ దేశాల మన్నలను పొందారని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి కలిగిన నాయకుడని, యువత భవిష్యత్ కోసం ఆలోచన చేసే నాయకుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, బిజెపి రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జీ, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, టిటిడి బోర్డ్ సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, కోలా ఆనంద్, దయాకర్ రెడ్డి, శ్రీశైలం దేవస్థానం బోర్డ్ ఛైర్మన్ రమేష్ నాయుడు, వర ప్రసాద్, పొనగుంట భాస్కర్, గాలి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# అమ్మాయిలను వేధిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు

## షి టీమ్ పోలీసులు



**నేటి సాక్షి, నారాయణపేట, అక్టోబర్ 30 :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని నూర్జహాన్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్లో విద్యార్థులకు టీమ్ పోలీసులు మహిళల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మరియు హెల్ప్‌లైన్ నంబర్లు (100, 1091, 181) గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షి టీం పోలీసులు బాలరాజు మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నతనం నుండి బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని తల్లిదండ్రులకు తమ గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అలాగే కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ కి, స్కూల్, మరియు కాలేజ్ కి వచ్చిపోయే సమయంలో ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే విద్యార్థులు ధైర్యంగా తమకు ఎదురయ్యే వేధింపుల గురించి నిస్సంకోచంగా షి టీమ్ పోలీసులకు తెలుపాలని లేదా షి టీమ్ నంబర్ 8712670398 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు షి టీమ్ పోలీసులు చేనప్ప, ఇనిస్టిట్యూట్ సిబ్బంది పాల్గొన్నారు.

# వివిధ వివాహ శుభకార్యాలకు హాజరైన నర్సారెడ్డి భూపతి రెడ్డి



**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ అక్టోబర్ 30 :** వివిధ వివాహ శుభకార్యాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన లిమాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, ఓబీసీ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ భరత్ గౌడ్, దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

# శ్రీ శక్తిపీఠాన్ని సందర్శించిన మాజీ మంత్రి పితాని కుటుంబసభ్యులు




**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) రామచంద్రాపురం :** మండలంలోని రాయలు చెరువు వద్ద వెలసిన శ్రీ శక్తిపీఠాన్ని గురువారం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం శాసనసభ్యులు, మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ కుటుంబ సమేతంగా శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించారు. ముందుగా పీఠంవద్ద చేరుకున్న వారికి శ్రీ శక్తి పీఠం కార్యనిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు అనంతరం లోక కళ్యాణ అర్థం ప్రత్యేక పూజలు హెూమాలు నిర్వహించి జగద్గురువుల పూజ్యశ్రీ మాతాజీ వారి దివ్య ఆశీస్సులు పొందారు మరకత శ్రీ శక్తి కాళికాదేవి అమ్మవారి దర్శనం తోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ పీఠాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎంతో ఆహ్లాదకరంగా అందమైన పచ్చని కొండలు నడుమ శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించిన రాయలు చెరువు గట్టు పై వెలిసిన శ్రీ శక్తి పీఠం మరకత శ్రీ శక్తి పీఠం కాళికాదేవి శక్తి గా వెలిసిన అమ్మవారి దర్శనం భాగ్యం పూర్వజన్మ సుకృతమన్నారు

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారికి అలంకరణ దాత ఎలిగేటి సురేందర్



**నేటి సాక్షి ప్రతినిధి చేవెళ్ల న్యూస్ :** గత 20 సంవత్సరాల నుండి స్వామివారికి అలంకరణ దాత ఎలిగేటి సురేందర్ రెడ్డి సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను స్వామివారి ఆశీర్వాదాలతో వారి కుటుంబ సుఖ సంతోషాల తో ఉండాలని స్వామి వారి నమ్మకంరంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం జై శ్రీమన్నారాయణ శ్రీనివాస పరబ్రహ్మణే నమః. శ్రీమతే రామానుజాయ నమః. శ్లో,, శ్రీ వైకుంఠ విరక్తాయ. భక్తాభీష్ట ప్రదాయచ, తంగడపల్లి నివాసాయ. వేంకటేశాయ మంగళమ్,, దశావతార సహిత శ్రీ పద్మావతి అలమేలుమంగ సమేత తంగడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం. పుణ్యాహవాచనం. స్నపన తిరుమంజనం. శ్రీ వేంకటేశ్వర స్వామికి అనేక నది జలాలతో పంచామృతములతో అభిషేకం. యజ్ఞ కార్యక్రమం క్రతువు మహా వైభవంగా జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా. ఆలయ ప్రధాన అర్చకులు. శ్రీమాన్ నడాదూర్ వెంకటనాథా చార్యులు. శ్రీమాన్ నడాదూర్ శేషాద్రి చార్యులు. శ్రీమాన్ నడాదూర్ వేణుగోపాలచార్యులు. స్వామివారికి అలంకరణ దాత ఎలిగేటి సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను స్వామివారి ఆశీస్సులతో వారి కుటుంబ సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలనీ మరియు స్వామివారికి ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేయాలనుకుంటున్నారు స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా వారిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము ఈ కార్యక్రమంలో గ్రామ చిన్నలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# పహాడీశరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం.



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 30:** పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా పహాడీశరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ కాలనీలోని యువన్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. పోలీస్ శాఖ పనితీరు, పిటిషన్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ, వి. హెచ్. ఎఫ్ సెట్ వినియోగం గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే సైబర్ మోసాలు, మత్తు పదార్థాల వ్యసనం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్. హెచ్. ఓ పహాడీశరీఫ్

# ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించండి





## ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**నేటి సాక్షి :పాములపాడు అక్టోబర్ 30 :** వినతుల రూపంలో వచ్చిన ప్రజా సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య అధికారులను ఆదేశించారు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సరోజినీ వర్జినియ ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై పలు శాఖల పనితీరు ఆయన సమీక్షించారు ముందుగా వైద్యానికి సంబంధించిన పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు అలాగే విద్యకు కూడా అధిక ప్రాధాన్యత కూటమి ప్రభుత్వం ఇస్తుందన్నారు రోడ్లకు సంబంధించి పంచాయతీ రాజ్ ఏ ఈ వివరణ కోరగా ఏ ఈ రాఘవేంద్ర ప్రసాద్ రోడ్ల గురించి వివరించారు గ్రామపంచాయతీ తీర్మానం చేసి పంపించాలని చార్ల సార్లు చెప్పానని అయినా ఎలాంటి ఫలితం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గోకులం షెడ్లు చెరువులు తావుకోవచ్చన్నారు గ్రామాలలో సి సి రోడ్లు సరిగా ఉన్నాయి లేదో చూసుకోలన్నారు గ్రామాలలో మౌలిక వసతులు సరిగా లేనట్లయితేవెంటనే తెలియజేయాలన్నారు కో అప్టేట్ మెంబర్ సయ్యద్ ముర్తూ జావలి మాట్లాడుతూ మండల కేంద్రమైన పాములపాడు బస్టాండ్ సెంటర్లో మరుగుదొడ్లు లేక మహిళలు విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దానిని సత్వరమే పరిష్కరించాలన్నారు అలాగే వివిధ గ్రామాలలో పారిశుధ్యం నిర్వహణ చేపట్టాలని వీధిలైట్స్ వెలగడం లేదని వాటిని కూడా సరిచేయాలని అక్కడే ఉన్న అధికారులకు తెలియజేయడం జరిగింది అనంతరం వ్యవసాయ శాఖ ఎన్ఆర్ఈజీఎస్ శాఖలపై సమీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ చంద్రశేఖర్ వివిధ గ్రామాల సర్పంచ్ లు ప్రజా పతినిధులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

# తడిచిన ధాన్యాన్ని పరిశీలించిన బిజెపి నాయకులు

- **అకాల వర్షం వల్ల తడిచిన ధాన్యాన్ని పరిశీలించిన బిజెపి నాయకులు...**



**నేటిసాక్షి ప్రతినిధి చందుర్తి (సతీష్) :** చందుర్తి మండల భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున కురిసిన అకాల వర్షం తడిసిన ధాన్యాన్ని పరిశీలించడం జరిగింది.వరి కోతలు కోసి నెల రోజులు అవుతున్నా గాని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల ప్రారంభించకపోవడం వల్ల వచ్చిన దాన్యం తడిసి ముద్ద కావడం జరిగింది వెంటనే యుద్ధ ప్రాతిపదికను తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి అలాగే ఈ వర్షానికి నేలకొరిగిన వారి పంటలను నష్టపోయిన రైతులకు ఎకరాకు ఒక 15,000 నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది రైతులు ఆరు కాలం పండించిన పంట ఇలా అకాల వర్షం కారణంగా నష్టపోవడం రైతుల బాధ చెప్పలేని విధంగా ఉంది. కావున ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మానవత దృక్పథంతో కొనుగోలు చేయవలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొకిలే విజేందర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు మార్త సత్తయ్య జిల్లా కౌన్సిల్ మెంబర్ ఫోన్నెట్టి రాకేష్ మండల ప్రధాన కార్యదర్శి పెరుక గంగరాజు కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు చింతకుంట సాగర్ నాయకులు చింతకుంట గంగాధర్ పత్తిపాక శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు దుర్నేట్టి రోజు, చిర్రం తిరుపతి తోట శేఖర్ పెరుక రంజిత్, బోరుగాయ తిరుపతి లోలపు శేఖర్, ముప్పిడి సత్తయ్య నిరటి చంద్ర శేఖర్ రైతులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరానికి రూ.30వేలు అందించాలి



- **నేలకొరిగిన పంటలను పరిశీలించిన : జూలకంటి రంగన్న**

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంట పొలాలకు ప్రభుత్వం ఎకరానికి రాజ్.30వేలు పరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గూడూరు గ్రామంలో నెలకొరిగిన వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను పరామర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముంతా తుఫాను వల్ల రైతులకు తీరని అన్యాయం జరిగిందని అవేదన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడిన పెట్టీ పంటలు సాగు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల రిత్యా పంటలు దెబ్బతిని, రైతులకు ఆర్థికంగా నష్టం తెచ్చిపెట్టిందన్నారు. పాలు పోసుకొని గింజ గట్టి, పడే సమయంలో ఈదురుగాలులు తుఫాను కారణంగా, వరి పంటలన్నీ నేలకొరగాయని దీనివల్ల గింజలు రాలిపోయానే తెలిపారు. ఎకరానికి 30 నుంచి 40వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టారని, తీరా పంట చేతికి వచ్చిన సమయంలో తుఫాను కారణంగా పంట నాశనం అయిందని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపించి, సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలన్నారు. ఎకరానికి 30 వేల పరిహార అందించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. రైతుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవి నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పిల్లుట్ల సైదులు గిరిజన సంఘం మండల అధ్యక్షులు రవీందర్ నాయక్, సిపిఎం శాఖ కార్యదర్శి సత్యనారాయణ, బదావత్ శీను, మోతిలాల్, రవి, మానేందర్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

## ఏఎస్సై రమణారెడ్డి



**నేటిసాక్షి : జగదేవపూర్ అక్టోబర్ 30 :** మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జగదేవపూర్ మండల ఏఎస్ఐ రమణ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మునిగడప, చాట్లపల్లి , వాహనాల డ్రైవర్లకు , గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవిస్తున్న యువకులకు మద్యం వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగు తున్నాయని అన్నారు. ప్రమాదాల నివారణకు మద్యం సేవించకుండా వాహనాలు నడపడం మంచిదని చెప్పారు.ఒక ప్రమాదంతో రెండు కుటుంబాలు ఆర్థిక నష్టాలతో పాటుగా చిన్న భిన్నం అవుతాయని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి రూ. 10 వేల జరిమానా విధించడం లేదా ఆరు నెలలు జైలు శిక్ష అమల్లోకి రావడం జరిగిందనీ చెప్పారు. అలాగే ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం కూడా జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించి రెండవసారి వాహనం నడుపుతూ పట్టుపడితే రూ. 15 వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. జరిమానా డబ్బులు కట్టని వారికి, జైలు శిక్ష విధించడం జరుగుతుందనీ తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని ప్రజలకు సూచించారు. తల్లితండ్రులు మైనర్లకు, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని ప్రజలకు తెలియజేశారు. పై నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పోలీస్ సిబ్బంది రవి ఉన్నారు.


# గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు.. ఇంకా లభించని ఆచూకీ



**నేటి సాక్షి పాములపాడు అక్టోబర్ :** ముంత తుఫాను కురిసిన భారీ వర్షానికి భవనాసి వాగు ఉధృతంగా ప్రవహించింది ఈ వాగులో కొత్తపల్లి మండలం నాగంపల్లి కు చెందిన జల్లె నాగేశ్వరావు అనే వ్యక్తి గల్లంతయినాడు. ఈ మృతదేహం కోసం కర్నూల్ నుంచి వచ్చిన 28 మంది రెస్క్యూటివ్ సభ్యులు గాలించారు. అయితే మృతదేహం సాయంత్రం వరకు లభ్యం కాలేదు. అతను తీసుకెళ్లిన బైక్ మాత్రమే కనపడింది. ఈ సంఘటనలో స్థలానికి చేరుకున్న డిప్యూటీ తాసిల్దారు పటాన్ బాబు ఎస్ఐ సురేష్ బాబు ఘటన స్థలానికి వెళ్లి దగ్గరుండి పర్యవేక్షించారు. ఘటన స్థలానికి డిఎస్పి రామాంజనేయులు సిఐ సురేష్ కుమార్ రెడ్డి చేరుకుని పర్యవేక్షించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ..

## మాజీ ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** గంగాధర నెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలం గోపిశెట్టి పల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు లక్ష్మయ్య పెద్ద కుమారుడు లాలూ ప్రసాద్ వివాహ మహోత్సవానికి మాజీ ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి హాజరై నూతన వధూవరులు ఆశీర్వదించారు. జీవితాంతం సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమానికి పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎం ఎల్ ఏ నరేంద్ర వర్మ తుఫాన్ సహాయక చర్యలు భేష్

## డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు





**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (పిట్టల వాని పాలెం) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి బాబు గారు దిశ నిర్దేశించారు, చినబాబు నాయకత్వంలో బాపట్లలో నరేంద్రన్న అమలుపరచారు. తుఫాన్ ను ముందుగా అంచనా వేసి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తుచా తప్పకుండ అమలు చేయించిన మన గౌరవ శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా పని చేసిన జిల్లా కలెక్టర్ గారికి,సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ గారికి,అన్ని ప్రభుత్వ శాఖలకు, ముఖ్యంగా ఎప్పటి కప్పుడు సమాచారం ఇస్తూ ప్రజలను అప్రమత్తం చేసిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు అభినందనలు. ముఖ్యంగా రెవెన్యూ మరియు పోలీస్ వారికి ప్రత్యేక ధన్యవాదములు. తుఫాన్ సహాయక చర్యలలో పాల్గొన్న కూటమి నాయకులకు నమస్కారములు. ఎలాంటి విపత్కర పరిస్థితి నైనా ముందుగా అంచనా వేసి ఎదుర్కొనే సత్తా ఉన్న నాయకులు మన ముఖ్యమంత్రి బాబు అనుటకు ఇది నిదర్శనం అని అన్నారు.వర్మ నిన్న అంతా ప్రజలతో ఉండి పునరావాసకేంద్రం లోనే బాధితులతో కలసి ఉన్నతీరును బాపట్ల నియోజకవర్గ ప్రజలు ఎప్పటికి మరువలేనిది అని కొనియాడారు.

# ఒక్క పరుగు ఐక్యతకు ప్రతీక

## ఎస్ఐ బోయిని సౌజన్య




**నేటి సాక్షి, బెజ్జంకి:** జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా బెజ్జంకి పోలీసుల ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ" 3 కిలోమీటర్ల రన్ నిర్వహించబడుతుందని ఎస్ఐ బోయిని సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ కార్యక్రమం అక్టోబర్ 31వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని, అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమై మ-ుత్తన్నపేట ఎక్స్ రోడ్ వరకు వెళ్లి తిరిగి అంబేద్కర్ విగ్రహం వద్ద ముగుస్తుందని అన్నారు.మండలంలోని విద్యార్థులు, యువత, రన్నర్స్ మరియు వాకర్స్ అందరూ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని జాతీయ ఐక్యతకు ప్రతీకగా ఈ రన్‌ను విజయవంతం చేయవలసిందిగా ఎస్ఐ సౌజన్య కోరారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం
29 అక్టోబర్ 2025


# ప్రతి బాధిత రైతుకు న్యాయం చేస్తాం

## మంత్రి గొట్టిపాటి రవికుమార్



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (అద్దంకి) :** ముందా తూఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి బాధితలకు, రైతుకు న్యాయం చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గం, బాపట్ల జిల్లా మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ గురువారం జె. పంగులూరు మండలంలోని బూదవాడ, కోటపాడు, కొండమూరు గ్రామాలను సందర్శించారు. తుఫాన్ ప్రభావంతో నీటమునిగిన మొక్కజొన్న, మినుము, మిర్చి,వరి పంట పొలాలను పరిశీలించిన మంత్రివర్యులు, స్థానిక రైతులతో మాట్లాడి పంట నష్టాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు వ్యవసాయ, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జరిగిన పంట నష్టాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ప్రతి అర్హ రైతుకు ప్రభుత్వం అందించే సహాయం త్వరితగతిన చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడి ఉంటుందని, ప్రతి బాధిత రైతుకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రివర్యులు తెలిపారు. పలు శాఖల అధికారులు,సచివాలయం సిబ్బంది ,పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

# జూబ్లీహిల్స్ ప్రచారంలో జగదేవపూర్ కాంగ్రెస్ నేతలు



**నేటిసాక్షి : జగదేవపూర్ అక్టోబర్ 30 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో జగదేవపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జగదేవపూర్ కాంగ్రెస్ మాజీ సర్పంచ్ కొంపల్లి కరుణాకర్, ధర్మారం మాజీ సర్పంచ్ మల్లేశం, నాయకులు ఆంజనేయులు గౌడ్, చిరంజీవి, అబీజ్ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలను ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జగదేవపూర్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టినట్లు వివరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ కు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరని తెలిపారు.

# తాత్కాలిక ఆనందం కొరకు జీవితాలు నాశనం చేసుకోవద్దు

- **యువత తాత్కాలిక ఆనందం కొరకు జీవితాలు నాశనం చేసుకోవద్దు**




**నేటి సాక్షి, చేర్యాల:30-అక్టోబర్-2025 :** నార్కోటిక్ డాగ్స్ తో గంజాయి ఇతర మత్తుపదార్థాల నివారణ గురించి మద్దూర్, కొమరవెల్లి, పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఉన్న కిరాణా షాపులు, టీ కొట్టులు, మరియు ఇతర అనుమానాస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. గంజాయి ఇతర మత్తుపదార్థాల పై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది గంజాయి రహిత జిల్లా గురించి ప్రతి ఒక్కరూ సహకరించాలి. యువత తాత్కాలిక ఆనందం కొరకు జీవితాలు నాశనం చేసుకోవద్దు కొమురవెల్లి ఎస్ఐ రాజు, మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ గారి ఆదేశానుసారం నార్కోటిక్ డాగ్స్ తో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణంలో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్ తో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు మరియు మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా లేక అక్రమంగా రవాణా చేసిన పాన్ షాపులలో కానీ ఇతర షాపులలో అమ్మిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే అమ్మిన విక్రయించిన వెంటనే డయల్ 100 లేదా తెలంగాణ యాంటీ నార్కటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్,1908 లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అజయ్ కుమార్, మద్దూర్ హెడ్ కానిస్టేబుల్ నాగిరెడ్డి మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొరపాక అంజిని అభినందించిన ఏసిపి



- **20 మందికిపైగా ఎమ్మార్పీఎస్ నాయకులచే రక్తదానం చేపించిన మేడ్చల్ నియోజకవర్గం ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు కొరపాక అంజి మాదిగ**

**నేటి సాక్షి ఉప్పల్ అక్టోబర్ 30 :** పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా గురువారం మల్లాపూర్ లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయనతోపాటు దాదాపు 20 మందికిపైగా ఎమ్మార్పీఎస్ నాయకులచే రక్తదానం చేపించిన మేడ్చల్ నియోజకవర్గం ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు కొరపాక అంజి మాదిగను ఉప్పల్ ఏసిపి చక్రపాణి అభినందించారు. ప్రతి సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న అంజి ఎంతోమందికి ఆదర్శమని ఆయన కొనియాడారు. నాచారం సీఐ ధనుంజయ్ గౌడ్ మాట్లాడుతూ అనునిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రజాసంక్షేమంలో పాలుపంచుకుంటున్న అంజి మాదిగ ఆదర్శమని అన్నారు ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

## - ఏఎంసీ మాజీ డైరెక్టర్ దీటి రాజు



**నేటి సాక్షి, బెజ్జంకి:** అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బెజ్జంకి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దీటి రాజు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పంట కోతకు సిద్ధం చేసుకున్న సమయంలో ఈ అకాల వర్షం రైతుల కష్టాలను నీటిలో కలిపిందని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయే తప్ప, నిజమైన కొనుగోలు ప్రక్రియ ఇంకా సాగడం లేదన్నారు. రైతులు తమ ధాన్యం కుప్పల దగ్గరే రాత్రింబగళ్లు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ముందుకు వచ్చి పంట నష్టాన్ని అంచనా వేసి, రైతులకు నష్టపరిహారం అందించాలనీ, లేకపోతే రైతులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు.

# నేడు జగదేవపూర్ లో టుకె రన్ పోటీలు



**నేటిసాక్షి : జగదేవపూర్ అక్టోబర్ 30 :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రమైన జగదేవపూర్ లో టుకె రన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు గొల్లపల్లి చౌరస్తా నుండి టూ కే రన్ పోటీలు ప్రారంభం అవుతాయని, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు ప్రజాప్రతినిధులు పోటీలో పాల్గొనాలని కోరారు. ప్రతిభ చాటిన వారికి ప్రశంస పత్రంతో పాటు బహుమతులు అందిస్తామని తెలిపారు.

# రైతులను ముంచిన మొంథా

## మండలంలో వందల ఎకరాల్లో పంట నష్టం



**నేటిసాక్షి : జగదేవపూర్ అక్టోబర్ 30 :** ఆరు కాలం కష్టం చేసి పండించిన పంట నేలపాలు కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్ వల్ల జగదేవపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో వందల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. చేతికి వచ్చే సమయంలో వరి పంటలు నేలకొనడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోటికాడి కూడును తుఫాన్ ఎత్తగొట్టిందని వాపోతున్నారు. అలాగే పత్తి పంటలు కూడా కురిసిన వర్షానికి పూర్తిగా తడిసిపోయి పత్తి నల్లబడుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేయడంలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, పంట నష్ట పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎస్ సి బాలుర హాస్టల్ సందర్శించిన ఎం ఎల్ ఏ



**నేటి సాక్షి (పూరెళ్ల బాపు) జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో గల ఎస్సీ బాలుర హాస్టల్ లో ఇటీవల ఎనిమిదవ తరగతి చదువుతున్న హిమేష్ చంద్ర అనే విద్యార్థికి హాస్టల్ బిల్డింగ్ పై పిడుగు పడి తీవ్ర గాయాలు కాగా జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎస్సీ బాలుర హాస్టల్ ను ఈరోజు సందర్శించి,విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు తెలుసుకొని,పిడుగు పాటుకు దగ్ధం అయిన గదిని పరిశీలించి,వసతి గదులు,వంట గది పరిశీలించి, హిమేష్ చంద్ర హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందుతూ ఉన్నాడని ప్రాణాపాయం లేదని ఈసందర్భంగా విద్యార్థులకు ధైర్యం చెప్పిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సంపత్ కుమార్,మాజీ కౌన్సిలర్ శ్రీలత రామ్మోహన్ రావు mrps నాయకులు బాలే శంకర్ దుమల రాజ్ కుమార్, దుమాల గంగారం, సురుగు శ్రీనివాస్,బొల్లి అనిల్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# బోన్ మ్యారో వ్యాధి బాలునికి రూ.1.61 లక్షలు సహాయం

- సిఐ కరుణాకర్, ఎస్సై రవికిరణ్ చేతుల మీదుగా కొంత మొత్తం పంపిణీ

**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి ( గుండ ప్రశాంత్ గౌడ్ ) :** గొల్లపల్లి మండలం చిల్వకోడూరు గ్రామానికి చెందిన అల్లాడి ప్రభాకర్, అనురాధల కుమారుడు రుద్రాంన్ష్ అనే బాలుడు కొన్ని నెలల క్రితం నుండి బోన్ మ్యారో వ్యాధితో బాధపడు తున్నాడు. వైద్యానికి లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉ ండగా తల్లిదండ్రులు నిరుపేదలు అవడంతో వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్పందించి ఈ నెల 4 న ఫేస్ బుక్ లో పోస్ట్ చేసి సాయం అందించాలని కోరాడు. ఫేస్ బుక్ పోస్టుకు స్పందించిన ఎన్నారైలు,ఇతర దాతలు వారి బ్యాంకు ఖాతాకు 1.61 లక్షలు పంపించారు. వాటిలో కొంత మొత్తాన్ని గురువారం జగిత్యాల సిఐ కరుణాకర్,ఎస్సై రవికిరణ్ చేతుల మీదుగా పంపిణీ చేయించాడు. మిగతాది రుద్రాంన్ష్ తల్లి బ్యాంకు ఖాతాలో నిల్వ ఉంచారు. ప్రభుత్వం సైతం స్పందించి రుద్రాంన్ష్ బాలుడి వైద్యానికి సహాయం అందించాలని రమేష్ కోరాడు. ఫేస్ బుక్ పోస్టుకు స్పందించిన ఎన్నారైలు,ఇతర దాతలకు రుద్రాంన్ష్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



# శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు




**నేటి సాక్షి, జగిత్యాల :** జగిత్యాల జిల్లా భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడం కోసం, మత్తు పదార్థాల నిర్మూలానే లక్ష్యంగా జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఈ క్రమంలో, నేడు ధర్మపురి పట్టణం లో డాగ్ స్క్వాడ్ మరియు బాంబ్ డిస్పోజల్ (%దీణ%) టీమ్ సహకారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో బస్ స్టాండ్ మరియు పరిసర ప్రాంతాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అనుమానాస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులు లేదా భద్రతకు ముప్పు కలిగించే అంశాలపై ప్రత్యక తనికి నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సి.ఐ రామ్ నరసింహ రెడ్డి మాట్లాడుతూ. జిల్లా ఎస్పి ఆదేశాలమేరకు ఈరోజు ధర్మపురి పట్టణం లో తనిఖీ నిర్వహించడం తో పటిష్ట భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయడం జరుగుతుందని అన్నరు. పాన్ షాప్ లలో గంజాయి పదార్థాలను గుర్తించే జగిలాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని,జి ల్లాలో గంజాయి, మరే ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్న, ఇతరులకు విక్రయించిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే భద్రతా చర్యలు సమర్థవంతంగా కొనసాగుతాయని అన్నారు. ఎవరైనా అనుమానాస్పద వస్తువులు, వాహనాలు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నంబర్ కి సమాచారం ఇవ్వాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ లు ఉదయ్ కుమార్, రవీందర్ ,డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్‌తో పాటు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

# మిల్లర్లు ప్రతి గింజను దిగుమతి చేసుకోవాలి

- రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ఖరీఫ్ లో రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రైస్ మిల్లర్లు ఎలాంటి జాప్యం లేకుండా, మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దించుకోవాలని కోరారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని గూడూరులోని రామకృష్ణ రైస్ మిల్ ను తనిఖీ చేసి, మిల్లింగ్ కెపాసిటీ, బ్యాంకు గ్యారంటీ, బాయిల్డ్ రైస్ ప్రక్రియ తదితర అంశాల పై రైస్ మిల్లు యజమానితో మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు లో భాగంగా ఇప్పటివరకు నల్గొండ జిల్లాలో లక్ష 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం 290 కొనుగోలు కేంద్రాలకు వచ్చిందని, దేవరకొండ ప్రాంతంలో మరికొన్ని కేంద్రాలను ప్రారంభించాల్సి ఉందని, అయితే అక్కడ పంట కొంత ఆలస్యంగా వస్తుందని, సాధ్యమైనంత త్వరగా అక్కడ కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైస్ మిల్లర్లు జిల్లాలో ధాన్యాన్ని వీలైనంత త్వరగా దించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాగే మిల్లర్లు అందరూ ధాన్యాన్ని దించుకోవాలని, ఎలాంటి జాప్యం చేయవద్దు అని చెప్పారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అన్ని చర్యలు తీసుకుంటామని, ధాన్యం సేకరణ పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం జారీ చేసిన సూచనలను తూ.చా తప్పకుండా పాటించి, రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొంటామని ఆమె వెల్లడించారు. ఈ తనిఖీల్లో వారి వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, పౌర సరఫరాల డి.ఎం గోపికృష్ణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మరికల్ లో పోలీసుల ర్యాలీ



**నేటి సాక్షి,నారాయణపేట అక్టోబర్ 30 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో గురువారం రాత్రి పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని పోలీసులు, యువకులు విద్యార్థుల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మరకలు సీఐ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేని అన్నారు. ఇట్టి ర్యాలీని ప్రధాన రహదారిపై నిర్వహించారు అనంతరం ఇంద్ర గాంధీ చౌరస్తాలో అమరులైన పోలీసులకు క్యాండిల్ల తో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్ సూర్య మోహన్ రెడ్డి, మరికల్ ఎస్సై రాములు, పోలీస్ సిబ్బంది, ప్రతిభ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# రన్ ఫర్ యూనిటీ రన్నింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

మరికల్ సీఐ రాజేందర్ రెడ్డి....



**నేటి సాక్షి,నారాయణపేట అక్టోబర్ 30 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ఈనెల 31న ఉదయం 6:30ఏ ఎం గంటలకు మరికల్ పోలీస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ" రన్నింగ్ కార్యక్రమం ఉంటుంది కాబట్టి గ్రామ యువకులు, పెద్దలు ప్రతి ఒక్కరూ పాల్గొనీ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరుతున్నాము.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు..



**నేటి సాక్షి పాలేరు, అక్టోబర్ 30:** కూసుమంచి మండలం ఈశ్వరమాదారం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టడం జరిగింది. టీకాలో భాగంగా 29 తెల్ల పశువులకు , 558 నల్ల పశువులకు గాలికుంటు టీకాలు వేయడం జరిగింది. మొత్తంగా 64 మంది పాడి రైతులకు లబ్ధిచేకూరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ యరబోలు సూర్య నారాయణ రెడ్డి, జిల్లా పశువైద్య , పశుసంవర్ధక శాఖ అధికారి బి. శ్రీనివాసరావు డాక్టర్ ఆర్.నీలకాంత్ (కూసుమంచి పశువైద్యాధికారి), కె .స్వరూప పి.శ్రీనివాసరావు, ఎండీ. హమీద్ పాషా ఏ. స్వరూప సిహెచ్. మాధవ్ , మున్నగు పశువైద్య సిబ్బంది గోపాలమిత్రులు పి .గోపి , బి. భాస్కర్ రెడ్డి, కె.లక్ష్మా రెడ్డి పాల్గొన్నారు

# సస్య రక్షణ చర్యలు చేపట్టాలి..

పాలేరు డివిజన్ ఉద్యాన అధికారి పి అపర్ణ..



**నేటి సాక్షి పాలేరు , అక్టోబర్ 30 :** అధిక వర్షాల తర్వాత ఉద్యాన పంటలలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని పాలేరు డివిజన్ ఉద్యాన అధికారి పి అపర్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. నీట మునిగిన మిరప, కూరగాయల తోటలో నీళ్లు బయటికి తీసివేయాలనీ , అలాగే నీట మునగడంతో శిలీంద్రాల వలన వేరు కుళ్ళు రాకుండా మిరప మొక్కల పాదులను కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రామ లీటర్ నీటికీ కలిపి తడుపుకోవాలనీ సూచించారు.. అలాగే 19:19:19 లేదా ఫార్ములా-4 ను 5 గ్రామ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.ఇలా చేయడం వలన నీట మునిగిన మిరప కూరగాయల పంటలను రక్షించుకోవచ్చని తెలిపారు..

# బెజ్జంకి పోలీసుల ఆధ్వర్యంలో హక్కులపై అవగాహన



**నేటి సాక్షి, బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని చిలాపూర్ గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని బెజ్జంకి పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ ప్రజలు, యువతి యువకులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకోవడంతో పాటు, ఇతరుల హక్కులను గౌరవించడం సమాజ అభివృద్ధికి కీలకమన్నారు. సివిల్ హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజల్లో చట్టపరమైన అవగాహన పెంపుపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ సునీల్, సెక్రటరీ శ్రీనివాస్,గ్రామ పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

# టీఎస్ టీపీసీ బుక్స్ సెంటర్ ప్రారంభం



**నేటి సాక్షి, కరీంనగర్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే మారుతి ఎంటర్ ప్రైజెస్ బుక్ సెంటర్ ను టీఎస్ టీపీసీ రిటైర్డ్ డీజీఎం స్వర్ణలత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణలోని అన్ని పాఠశాలల పాఠ్య పుస్తకాలతో పాటు అన్నిరకాల నోట్ బుక్స్ ఇక్కడినుంచి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. డిస్ట్రిబ్యూటర్ నాగుల అనితాశ్రీకాంత్ ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా పుస్తకాలను పంపిణీ చేయడమే లక్ష్యంగా పెట్టుకొని, తిమ్మాపూర్ లో కార్యాలయంతో పాటు పుస్తక గోదాంను ప్రారంభించడం సంతోషకరమైన విషయమని చెప్పారు. డిస్ట్రిబ్యూటర్ నాగుల అనిత శ్రీకాంత్, టీఎస్ టీపీసీ రిటైర్డ్ మేనేజర్ వేదాంతం నరసింహాచారి, జ్యోతిష్యకర్త మల్యాల శ్రీనివాస్, పీ ఇంద్ర, ఆర్ రమామణి శేషసాయి తదితరులు పాల్గొన్నారు.